ముగ్గురు మూర్ఖులు

సుజనశ్రీ

పోస్టుమెన్ ఫకీరయ్య తన పాత సైకిలుని ఇసుకలో నెట్టుకుంటూ వెళ్ళి ఆ ఇంటిముందు ఆగాడు.

హైస్కూలు ఇనుప గేటులా పెద్ద పెద్ద ఇనుపచువ్వల గేటులోంచి చూస్తూ కేక పెట్టాడు "పోస్ట్" అని.

లోపల్నుంచి ఎటువంటి అలికిడీ లేదు. గేటు ఇనుప గొలుసుతో బంధించబడి, లోపల తాళం బిగించబడి ఉన్నది. వినుక్కుంటూ మరోసారి కేక వేశాడు.

ఈ ఇంటికి ఏనాడూ ఒక ఉత్తరంకూడా రాదు. పొరబాటున ఎప్పుడో ఏడాదికోసారి ఏదన్నా జాబు వచ్చిందంటే ఆ గేటుముందు నిల్చుని తను అరచి అరచి చచ్చిపోవాల్సిందే.

అసలు దాన్ని ఇల్లు అనేకన్నా ఇనప్పెట్టె అంటే బాగా అతుకుతుంది.

కొండ రాళ్ళతో బ్రిటిష్ వాళ్ళు కట్టడంలా ఉంటుంది. ఎత్తైన ప్రహారీ గోడలు, ఎనిమిదడుగుల ఇనుప గేటు ఈ హంగామా అంతా చూస్తుంటే అది ఎంతో భద్రంగా ఉండటంకోసమే ఉద్దేశించి కట్టబడిందని తెలుస్తుంది.

మూడో కేకకు లోపల్నుంచి సమాధానం వచ్చింది. "ఓయ్! ఓయ్! వస్తున్నా!" అంటూ ముసలి నౌకరు రాములు గేటుదగ్గరకు వచ్చాడు.

"ఉత్తరమా ఫకీరయ్యా! నాకా?మా బాబుగారికా?" ఆత్రంగా అడిగాడు రాములు.

"నీకూ నాకూ ఉత్తరాలు గూడానా? ఇది మీ డాక్టర్ గారికే!" అన్నాడు ఫకీరయ్య.

కటకటాల మధ్యలోంచి కవరు అందుకున్నాడు రాములు. అతడి కళ్ళన్నీ దానిమీద నే ఉన్నయ్. ఏనాడూ ఆ ఇంటికి ఉత్తరం రానందువల్ల, సాధారణ ఉత్తరాన్ని చూసినా మరణవార్త తెలిపే టెలిగ్రాంని చూసినట్టుగా హడలిపోవటం మామూలు.

రాములు కంగారుని చూసి నవ్వుకుంటూ ఫకీరయ్య వెళ్ళిపోయాడు.

శ్రీరాములవారికి అంగుళీయకం ఇస్తున్న భక్తశిఖామణి హనుమంతుడిలా రాములు ఉత్తరాన్ని డాక్టర్ విష్ణువర్ధన్‌కి అందించాడు.

డాక్టర్ కవరుచించి ఉత్తరం చదివాడు. నిర్లక్ష్యంగా దాన్ని మడిచి డ్రాయరు సొరుగులాగి అందులో వేశాడు.

ఉత్తరంలోని విశేషం చెబుతాడేమో నని రాములు ఆయనవంకే చూస్తూ నిలబడ్డాడు.

"మాకు దూరపు బంధువు సుబ్బారావు అనేవాడు

తన భార్యతో సహా మనింటికివచ్చి తిట్టవేస్తాడట.''

''అలాగా బాబూ!''

''వాడ్ని రావద్దని రేపే రాసెయ్యాలి ఉత్తరం!'' అన్నాడు డాక్టర్ ఎక్కడో ఆలోచిస్తూ.

''చిత్తం! అలానే రాయండి బాబూ! ఇక్కడేదో ఈళ్ళందరికీ ధర్మసత్తరం ఉందనుకున్నారేమో!''అన్నాడు రాములు.

కాని డాక్టర్ విష్ణువర్ధన్ ఆ ఉత్తరానికి సమాధానం రాయలేదు. అసలు అతడి వ్యక్తిత్వమే విచిత్రంగా ఉంటుంది.

అతగాడు ఇదివరలో మిలిటరీలో పనిచేశాడు. బహుశా అందుకల్లనే మనిషి ఆహారాది విషయాల్లో చాల క్రమంగా ఉంటాడు. మితభాషి. అవసరానికి మించి ఒక్కమాట ఎక్కువ మాట్లాడడు. అజానుబాహువు. ఎర్రగా ఉంటాడు. తెల్లబడిన గుబురు మీసాలు, కండలు తిరిగిన దేహం.

అతడి భార్య చనిపోయి చాలాకాలం అయింది. మొదటి కాన్పులోనే ప్రసవవేదనతో చనిపోయింది. పుట్టిన బిడ్డకూడా బ్రతకలేదు. ఆ తర్వాత ఎందరు వత్తిడి చేసినాగాని అతడు తిరిగి మరో పెళ్ళి చేసుకోలేదు.

తన ఆదాయంలో చాలా భాగంతో మహాబలిపురంలో స్థలాలు కొనేశాడు చాల చవకగా. తర్వాత తర్వాత టూరిస్ట్ డిపార్ట్మెంటువారు ఆ ఊరిని టూరిస్ట్ సెంటర్ క్రింద డెవలప్ చేసిన తర్వాత అక్కడ హోటళ్ళు చాలా వెలిసినయ్. విష్ణువర్ధనరావు స్థలాలకు బాగా డిమాండ్ వచ్చింది.

అలాగే మద్రాసు నగరంలో కూడా కొన్ని స్థలాలు కారు చవకలో కొన్నవాటిని మంచి ధరకు అమ్మేశాడు.

మిలిటరీలోంచి రిటైరయిన తర్వాత మహాబలిపురం లోనే ఊరికి చివరగా సముద్రతీరం కనబడుతూండేటుగా రాతి కట్టడాన్ని నిర్మించుకుని, అందులో ప్రశాంతంగా నివసించసాగాడు.

అతడికి కొన్ని లక్షలరూపాయలు వచ్చినయ్ సలాల అమ్మకం మీద. వాటిని ఏ బ్యాంకులోనూ వేయలేదు అతడు. నేషనలైజు చేయబడ్డ బ్యాంకులు తాడూ బొంగరం లేని వాళ్ళందరకూ అప్పులిచ్చి కొన్నాళ్ళకు తప్పకుండా దివాలా తీస్తాయని అతగాడి వెర్రి నమ్మకం. అందుకే కొండ రాతితో 'స్ట్రాంగ్ హౌస్' కట్టుకుని అందులోనే క్యాష్ రూమ్ ఏర్పరచి తన డబ్బంతా అందులో కరెన్సీరూపంలోనే దాచాడని అక్కడి ప్రజలు చెప్పుకుంటూరు.

అంతేకాదు, అతడు ఎవరికీ దానధర్మాలు చేసినట్టు గాని, లేదా అప్పివ్వటంగాని చెయ్యంగా ఎవరూ చూడ లేదు. అందుకే అతను కాకికికూడా చెయ్యి విదల్చని పిసినారి అని పేరుబడిపోయాడు. ప్రజలు ఎన్ని అనుకుంటేనేం అతడిది నిశ్చింత అయిన జీవితం. విస్కీ త్రాగటం, సిగార్ కాల్చటం తప్ప మరే దురలవాట్లూ లేవు.

2

మూడురోజులు గడిచిన తర్వాత మద్రాసునుంచి మహాబలిపురం వచ్చిన బస్‌లోంచి ఇద్దరు దంపతులు దిగారు.

భర్త ఎర్రగా పొడుగ్గా ఉన్నాడు. సన్నటి మనిషి. పీక్కుపోయిన దవడలు, గుంటలు పడ్డ కళ్ళు. మాసిన గడ్డం. ఇవన్నీ అతగాడు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడని చెబుతున్నయ్.

భార్య అతనికన్నా కొంచెం ఎత్తు తక్కువ. కాని కొంచెం లావు. మనిషి తెల్లగా ఉంది. అందగత్తె అనే చెప్పాలి. యాపిల్ పళ్ళలాంటి బుగ్గలు, గుండ్రటి కళ్ళు, వంకులు తిరిగిన పొడవాటి జుట్టుతో మనిషి సొగసుగా ఉంది.

"అలా చూస్తూ నిలబడాతావేం! ఆ పెట్టె తీసుకుని నడు!" గదమాయించాడు భర్త.

ఆమె బిత్తర చూపులు చూస్తూ బ్రీఫ్ కేస్‌ని, మరో హ్యాండ్ బ్యాగ్‌ని తీసుకుంది.

అతడు బెడింగ్ భుజాన పెట్టుకుని రెండో చేతిలోకి మరో బ్రీఫ్ కేస్ తీసుకుని డాక్టర్ విష్ణువర్ధన్ ఇంటివైపు నడిచాడు.

డాక్టర్ విష్ణువర్ధన్ నోట్లోంచి సిగార్ తీసి, వచ్చిన వాళ్ళిద్దరివంకా నిశితంగా చూశాడు. ఆయన ఎప్పుడు సైగ చేస్తాడో, వెంటనే వాళ్ళిద్దర్నీ బయటకు గెంటేయాలని ఎదురు చూస్తున్నాడు రాములు.

రాములు డాక్టరు దగ్గర గత పదేళ్ళనుంచీ నమ్మకంగా పని చేస్తున్నాడు. ఏ వాడు చుట్టాల్ని రానివ్వగా చూడ లేదు అతడు.

"బాబాయ్! నీ నుంచీ ఉత్తరంకోసం ఎదురుచూసి 'రావద్దని' జాబు రాలేదు గనుక, నీకు అభ్యంతరం ఉండదని మేమే వచ్చేశాం!" అన్నాడు ఆగంతకుడు.

"అలాగా!" అంటూ మళ్ళీ ఇద్దర్నీ మార్చి మార్చి చూడసాగాడు డాక్టర్ విష్ణువర్ధన్.

భార్యకు ముళ్ళమీద నిల్చున్నట్టుగా ఉంది. విదేశీ గూఢచారిని చూసినట్టుగా, అతిగాడు తమని అలా చూడటం ఆమెకు బాధ కలిగించింది. వచ్చినవాళ్ళు తమ లగేజిని గుమ్మంలోనే పెట్టుకుని అలాగే అతడి

ముందు నిలబడ్డారు.

"నేను చెప్పలా ముందరే! ఆయన రమ్మనందే మనం వెళ్ళితే బాగుండదని! ఇక పదండి! వచ్చిన దోవపడదాం!" అంది ఆమె విసుగ్గా.

ఆమె మాటలతో విష్ణువర్ధన్ ఈ లోకంలో పడ్డాడు.

"ఈ అమ్మాయి నీ భార్యా? పేరేమిటన్నావ్ సుబ్బారావ్?" అని అడిగాడు.

"దీని పేరు సుభద్ర బాబాయ్!"

"రాములూ! వీళ్ళ సామాన్లు తీసుకెళ్ళి లోపల పెట్టు. ముందుప్రక్క రెండు గదులూ వాళ్ళకు ఏర్పాటు చెయ్! వెళ్ళి కొళాయి దగ్గర కాళ్ళు కడుక్కోండి."

అంటూ తన క్రింద పనిజేసే సైనికులకు ఆజ్ఞలు జారీ చేసినట్టుగా గబగబా చెప్పేసి ఆ తర్వాత ముఖం ప్రక్కకు త్రిప్పుకుని, కిటికీలోంచి దూరంగా సముద్రం లోని కెరటాల్ని చూడసాగాడు.

వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళారు. వాళ్ళు అటు మళ్ళంగానే విష్ణువర్ధన్ చూపులు సుభద్రమీదకు మళ్ళినయ్. అసలామెను చూస్తూనే అతడు అవాక్కయిపోయాడు. గతంలో చనిపోయిన తన భార్య మళ్ళీ నూతన యవ్వనంతో తిరిగి వచ్చిందా అనిపించింది అతడికి.

తన పెళ్ళిరోజున తన భార్య ఎంత యవ్వనంగా వుందో సరిగా ఈ సుభద్రగూడా అలానే ఉంది. అందుకే వాళ్ళను వెళ్ళిపొమ్మందామని అనుకున్న వాడల్లా తన అభిప్రాయం మార్చుకున్నాడు. ఎందుకు? చనిపోయిన తన భార్యను సుభద్రలో చూసుకుందామని!

అయితే రాములుమాత్రం గొణుక్కున్నాడు ముందు. ఇంట్లో ఇద్దరు మనుషులు ఎక్కువైనారంటే తనకీ పని ఎక్కువౌతుంది. వంట చేయాలి. గుడ్డలుతకాలి. వాళ్ళ

పనులేవన్నా ఉంటేగూడా చేయాలి అని బాధపడ్డాడు.

రెండురోజులు గడిచేసరికి రాములు అనుకున్నట్టుగాకాక, అతని పని ఇంకా సులువైంది. సుభద్ర వంటపని అంతా చేసేది. దాంతో రాములుకు చాలాభాగం పని తగ్గింది.

సుబ్బారావు మటుకు వేళకు తిండి తినేసేవాడు. ఆ తర్వాత పడుకుని నిద్రపోయేవాడు. సాయంకాల సమయంలో సముద్రపు ఒడ్డుకు షికారు కెళ్ళి వచ్చేవాడు ఒంటరిగా. రాత్రయేసరికి కసిగా, మోటుగా తన భార్యను నలిపేసి, నరాలు వేడి తగ్గాక నిద్రలోకి జారుకుని గుర్రుపెట్టేవాడు.

సంపాదన లేకుండా, ఉద్యోగాలకోసం వేటాడి విసిగిపోకుండా, ఇక్కడే అతడి పని బాగుంది. వేళకు తిండి, ఉండటానికి ఇల్లు, తనకు సుఖాన్నివ్వటానికి భార్య! అతడే ఆ ఇంటి యజమానిలా నిశ్చింతగా గడపసాగాడు.

సుభద్ర విషయం అలాకాదు. ఆమె, చూస్తూనే విష్ణువర్ధన్ వ్యక్తిత్వాన్ని కనిపెట్టేసింది. అతగాడు కోపిష్ఠి అనీ, ఏ వేళప్పుడు తమని బయటకి గెంటేస్తాడో అని ఆమె భయపడుతోంది.

అందుకే స్వంత కోడలులా మామకు పరిచర్యలు చేస్తోంది. ఉదయాన్నే లేవంగానే టీ కాచి రెడీగా ఉంచటం, విష్ణువర్ధన్ లేవంగానే టూత్ బ్రష్ పేస్ట్ అందించటం, నీళ్ళూ టవలూ ఇవ్వటం ఆ తర్వాత టీ, స్నానం అవంగానే టిఫిన్, మధ్యాహ్నం సరిగా వేళకు భోజనం, అందులోనూ అతగాడికి ఇష్టమైన పదార్థాలు చేయటం. ఆ తర్వాత ఏదైనా నవలగానీ, పురాణంగాని చదివి వినిపించటం, సాయంత్రం అతడికి చపాతీలు చేసి పెట్టడం, నిద్ర పట్టేదాకా న్యూస్ పేపర్ గాని, ఏదైనా ఇంగ్లీషు నవలో, విశ్వనాథవారి సాహిత్యమో చదివి

వినిపించటం, విష్ణువర్ధన్ పడుకోగానే తన భర్త వద్దకు వచ్చి నడుం వాల్చేది.

3

“నారాయణరావ్, బి.య్యే.బి.యల్., అడ్వొకేట్” అన్న బోర్డు చదువుకుని ఆ ఇంటి ప్రక్క బంగళాలోనికి కారు పోనిచ్చాడు రాజా.

ఆ బంగళా చిన్నదే అయినా చూడముచ్చటగా ఉంది. చుట్టూ కాంపౌండ్ వాల్, రకరకాల చెట్లూ లోపల గార్డెన్, బోలెడంత ఆవరణ. నూతన దంపతులకు హనీమూన్ కి అనువుగా ఉంది.

ఆ బంగళా మద్రాస్ లో ఓ ఫిలిం నిర్మాతది. సీజన్ లో దాన్ని బాడుగకిస్తూంటాడు ఆయన.

“ఇల్లు చాలా బాగుంది రాజా!”

“నీ సర్టిఫికెట్ ఎవరికీ అక్కర్లేదు. సామాన్లు లోపల సర్ది వంట ఏడువ్! ఆకలిగా ఉంది.”

“అంత ఆకలిగా ఉంటే కారేసుకు వెళ్ళి హోటల్ నుంచి క్యారీయర్ తీసుకురాకూడదూ?” లాలనగా ఆమె అంది.

“ఓహో! ఈ రాణీగారు ఏం చెయ్యాలట!” అని వెటకరింపుగా అన్నాడు రాజు. “వెధవ్వేషాలు వెయ్యక చెప్పినట్లు చెయ్యి.”

“సరేకాని, ఒక్కటే ఒక్క ప్రశ్న అడుగుతాను. సమాధానం చెబుతావా?”

“ఏమిటది?”

“ఇక్కడగూడా మరో హత్య జరగబోతోందా?”

అతడు కోపంగా చూశాడు. “అంతటి అవసరం రాదులే! వెళ్ళి నీపని చూడురాణీ!” అంటూ బెడ్ మీద

వాలిపోయాడు.

ఆ బంగళాలో ఫారిన్ స్టయిల్‌లో బెడ్స్, కుర్చీలు, కర్టెన్స్, వంట సామగ్రి అన్నీ అమర్చబడి ఉన్నాయ్. వంట సామానేం తెచ్చుకోకుండా చేతులూపుకుంటూ వచ్చినా హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు.

గ్యాస్ స్టవ్ వెలిగిస్తూ ఆమె అంది. "రాజూ! ఈ బంగళా ఎంత బాగుంది. ఈ పరిసరాలు ఎంత ప్రశాంతంగా ఉన్నాయ్. ఇంట్లో ఫర్నిచర్, బెడ్‌షీట్స్, డోర్ కర్టెన్స్ ఎంత అందంగా ఉన్నాయ్. వంటింట్లో సయితం గ్యాస్ పొయ్యి, పాత్రలూ అన్నీ చూడముచ్చటగా ఉన్నయ్. ఇంతటితో నన్నా నీపాడు ప్లాన్లకు స్వస్తి చెప్పి, ఇట్లాంటిచోట స్థిరపడిపోదాం డార్లింగ్!"

"నా తాపత్రయంగూడా అదేగదా రాణి! సరిగా నేను కలల్లో ఊహించే వాతావరణం, పరిసరాలూ ఇవే! ఈ ఒక్కసారికి పని సక్రమంగా పూర్తి అవుతే ఈ బంగళానే కొనేసి హాయిగా బతుకుదాం రాణీ!"

ఆమె వంట మొదలెట్టింది. రాజు టెలిఫోన్ దగ్గరకు వెళ్ళి నెంబరు డయిల్ చేశాడు.

"టూరిస్ట్ హోటలేనా? ఇవాళుదయమే మద్రాసు నుంచి కనకారావనే వ్యక్తి వచ్చి ఉంటాడు! ఆయన్ను ఫోనులోకి పిలవండి."

ఒక నిముషం గడిచింది.

"హలో రాజూ! నేను కనకాన్ని!"

"గుడ్ మార్నింగ్ పార్ట్‌నర్! ఎప్పుడు వస్తావ్ నువ్వు?"

"నీవు ఎక్కడ మకాం చేసిందీ నాకు తెలీదే!"

"నా అడ్రసు కనుక్కోవటం తేలిక. బీచ్ రోడ్ మీదుగా వస్తే లాయర్ నారాయణరావ్ బోర్డు ఉంటుంది. ఆ ఇంటికి దక్షిణపు ప్రక్క బంగళా!"

"అలాగా! సరే! చీకటి పడ్డాక, అంటే బహుశా ఏడు ఏడున్నరకు వస్తాను. అంతా ఓకే!"

"ఇంతవరకూ ఓకే! మిగతావి ముఖాముఖి మాట్లాడుకుందాం! బై బై!" అంటూ ఫోన్ పెట్టేశాడు రాజు.

4

రాత్రి ఏడైంది.

ఓల్డుమోడల్ ఫోర్డ్ కారు రోడ్డుమీద దుమ్ము లేపుతూ వచ్చింది.

అందులోంచి కనకం దిగాడు. అతడు సన్నగా ఉన్నా ఎముకపుష్టి గలవాడు. ఎప్పుడూ సీరియస్‌గా ఆలోచిస్తూంటాడు. కళ్ళు ఎర్రగా ఉంటాయ్. పెద్ద అంగలు వేసుకుంటూ లోపలకు వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

ఇల్లంతా ఒకసారి కలియచూశాడు.

"నా లాడ్జింగ్ కన్నా ఇదే బాగుంది ఎన్నోరెట్లు! దీనికి అద్దె ఎంత?"

"నెలకు వెయ్యిరూపాయలు. రాజన్, రామేశ్వరం అనే పేరిట బుక్ చేశాను."

"బాగానే ఉంది. ఇంతా ఆ పిల్లోడు ఎప్పుడు వస్తాడు? వాడికి మన కొత్త అడ్రసు తెలుసా?"

"లేదు! మన ఫోన్ నెం. మద్రాసుకు తెలియజేశాను. ఆ నెంబరు వాడికీ తెలియజేయబడుతుంది. ఇక్కడ దిగంగానే మనకు ఫోన్ చేస్తాడు."

"ఇంతవరకూ బాగానే ఉంది. తర్వాత పనిగూడ సులభంగా జరిగిపోతే మన జీవితాలకు ఇబ్బంది ఉండదు!" అని చెప్పి "రాణీ! డ్రింక్స్ తీసుకురా రెండు!" అని కేక వేశాడు రాజు.

రాణి డ్రింక్స్‌తో వచ్చింది. కనకం ఆమెవంక ఎగాదిగా చూశాడు. ఆమె లోపలకు వెళ్ళిపోయాక అడిగాడు.

"ఈమె ఎవరు?"

"నా వెంట వచ్చింది!"

"ఆమెనెవరు తీసుకురమ్మన్నారు?"

"నాకు ఒకళ్ళు చెప్పేదేమిటి? నాకు అవసరం అనుకున్నాను, తెచ్చుకున్నాను. భోజనం ఎంత అవసరమో, స్త్రీ గూడ నాకు అంతే అవసరం! ఆమెవల్ల మనకేం ట్రబుల్ ఉండదు."

"కాని ఆడవాళ్ళంటే వాడితో వేగలేం!"

"ఓ! జోన్స్‌తోనా? వాడి సంగతి నేను చూసుకుంటాలే!"

"అసలు వాడ్ని ఎందుకు పిలిచావ్! మనిద్దరం చూసుకోలేకపోతామా?"

"నీకు తెలీదు. వాడు ఇటువంటి వాటిల్లో ఆరితేరినవాడు. రక్తపాతం లేకుండా, హత్యలు చేసుకురాగలడు."

"పోలీసు లిస్టులోవున్న పెద్ద నేరస్థుల పదిమందిలో నువ్వు మూడోవాడివి! నీకుగూడా మరొకడి సహాయం కావాల్నా!"

"నాకు చిరాకు తెప్పించకు ఆ ఎర్రటోపీలను గుర్తు చేసి. బయట తిరిగితే ఎవరన్నా నన్ను గుర్తుపడతారేమో అనే నేను ఎక్కడకూ వెళ్ళకుండా ఇంట్లోనే కూర్చుంటున్నాను. కనీసం మన పని అయేదాకానన్నా నా మొఖాన్ని దాచుకోవాలి!"

"క్రితంసారి నువ్వు అనవసరంగా ఆడమనిషిని చంపేశావ్."

"ఓ అదా! నా తప్పేమీలేదు అందులో. గాలిలోకి పేల్చాను అక్కడి వాళ్ళను భయపెట్టటానికి. బుల్లెట్

గోడకు తగిలి మళ్ళీ వెనక్కి వచ్చి ఆమెకు తగిలింది. ఆమె చనిపోయింది. అంతే!''

''అయితే ఇక్కడ నిన్నెవరూ గుర్తించలేదు కదూ?''

''లేదు! మామూలుగా లాడ్జింగుల్లోనూ, టూరిస్టు హోటల్స్‌లోనూ దిగే వాళ్ళపై పోలీసులు ఒక కన్ను వేసి ఉంచుతారు. అందుకే ఈ దఫా కారు తీసుకుని, పోష్ బంగళా అద్దెకు తీసుకున్నాను. ఇక్కడికెవరూ రారు.''

''ఆ సంఘటనలోనే గదూ జోన్స్ కలిసింది!''

''అవును. అతగాడే ఈ డాక్టరు గురించి చెప్పాడు. నేను అక్కడ్నుంచి పారిపోయి వచ్చిన తర్వాత ఆరు నెలలు బయటకు రాకుండా గడిపాను. ఈ లోపల నా కేసు పాతబడిపోయింది. బ్యాంక్‌లో తెచ్చిన డబ్బు అయిపోవచ్చింది. అందుకే మళ్ళీ పథకం వేశాను.''

''బహుశా ఎంత క్యాష్ నిల్వ ఉంటుంది ఆ డాక్టరు దగ్గర?''

''బహుశా పది,పదిహేను లక్షలకు తక్కువ ఉండదు!''

''అంత డబ్బు ఏదన్నా బ్యాంక్‌లో వేసుకోక అలా నిల్వ ఉంచుకున్నాడెందుకు?''

''వాడికి కొంత క్రాక్‌నెస్ ఉందని విన్నాను. ధనం ఎందర్నో బానిసలుగా చేసుకుంటుందట. అందుకని దానికి లొంగకుండా తనే ధనలక్ష్మిని బంధించేశానని వాడు అంటూంటాడట.''

''నిజంగానే క్రాక్‌లాగున్నాడు!''

''వీలైనంతవరకు ఎవర్నీ హత్యచేయకుండానే వాడి ధనలక్ష్మిని మనం ఎత్తుకుపోవాలి.''

''అవును! ఎవర్నీ హత్యచేయగూడదు. కాని జోన్స్ ఉన్నచోట హత్యలేకుండా ఉండదు'' అన్నాడు కనకం.

''కాని ముగ్గురన్నా లేందే పని జరగదు. ఒకడు గేట్

దగ్గర కాపలా ఉండాలి. ఇద్దరూ లోపల జొరబడి ఒకడు ఆ ముసలి పీనుగని తుపాకితో అదిమిపట్టి ఉంచితే, రెండో వాడు క్యాష్ సేఫ్ తెరచి మిగతా పని పూర్తిచేయాలి."

రాణి వచ్చి "వంట అయింది" అన్నది. బాత్ రూమ్ లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. ముగ్గురు భోజనం చేయసాగారు.

"క్రితంసారి అంటే బ్యాంక్ రాబరీకి ముందు నీవు జైల్లోంచి తప్పించుకున్నావట చాల గమ్మత్తుగా."

"అవును. అప్పుడు నన్ను ప్రిజన్-లేబర్ క్రింద వర్క్-షాపులో రిపేరింగ్ సెక్షన్ లో వేశారు. లారీలకు, ట్రక్కులకు వెల్డింగ్ చేసే పని నాది. ఒకసారి బాగా చెడిపోయిన ట్రక్కు వచ్చింది. అది బాగుచేస్తున్నట్టు చేస్తూనే దాని క్రింద భాగంలో రెండు కమ్మీల్ని బిగించాను. ఆ రాత్రికే డెలివరీ చెయ్యాల్సి ఉంది.

"ఆ మధ్యాహ్నమే నేను ట్రక్కు అడుగుభాగంలో కమ్మీల మధ్యలో పడుకున్నాను. ఎవరూ అనుమానించలేదు. ట్రక్కు బయటకు వచ్చేసింది. దోవలో రోడ్డుమీద అడ్డంగా ఉన్న రాళ్లు నా ఒంటికి తగిలి, గీక్కుపోయింది వళ్లు. అయినా ఓర్చుకున్నాను. రక్తం కారింది. బిగపట్టుకున్నాను. ఎలాగో బయటపడి తప్పించుకు వచ్చేశాను. అంతే! ఆ తర్వాత మళ్ళీ పట్టుబడకుండా జాగ్రత్తపడ్డాను. ఇకముందుకూడా పట్టుబడను."

భోజనాలు పూర్తిచేసి హాల్లోకివెళ్ళి కూర్చున్నారు. తాము పాల్గొన్న, ఓడిపోయిన యుద్ధాలగురించి మాట్లాడుకునే సైనికుల్లా లోగడ చేసిన నేరాల గురించీ, ఎలా పోలీసుల చేతుల్లోంచి తప్పుకుని బయటపడిందీ చెప్పుకున్నారు.

రాణి వంట ఇల్లంతా సర్ది వెళ్ళి తన గదిలో పడుకుంది.

"నీవుకూడా లాడ్జి ఖాళీచేసి రేపుదయమే ఇక్కడికి

వచ్చేసెయ్. లాడ్జిలో నిన్నెవరన్నా ఆనవాలు పట్టి నిన్ను ఫాలో అయ్యారంటే మనగుట్టు బయటపడిపోతుంది."

"నీకా భయం అక్కర్లేదు."

"ఇక్కడ నేను బాస్‌ని. ఈ పథకంలో ఉండాలంటే నా ఆర్డర్లు పాటించడమే నీ పని. తెలిసిందా?"

"ఓకే! బాస్! రేపుదయమే ఇక్కడకు వచ్చేస్తాను" అంటూ కనకం వెళ్ళిపోయాడు.

కారు స్టార్ట్ అయిన శబ్దం వింటూనే రాజు బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. తలుపు బిగించి, నిద్రలోకి జారుకుంటున్న రాణిమీదకు ఒరిగాడు.

5

సుబ్బారావు ఈ మధ్య ఒక కొత్త విద్య నేర్చుకున్నాడు.

మద్రాసు వెళ్ళి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తానని చెప్పి, సుభద్ర దగ్గర వందో, యాభయ్యో తీసుకుని మద్రాసు వెళ్ళటం, మస్తుగా తాగి రాత్రి వేళకు ఇంటికి చేరటం.

సుభద్ర చేతిలో కాష్ ఆడుతోంది. ఇంటి ఖర్చుల క్రింద నెలకు వెయ్యో, రెండు వేలో ఆమె చేతికిస్తున్నాడు ముసలాడు.

సుభద్ర కాలేజీ చదువు మధ్యలో ఆగిపోయింది. ఆమెకు సాహిత్యం అంటే అభిలాష. రోజూ శ్రద్ధగా డాక్టర్ విష్ణువరన్‌కి పేపరు చదివి వినిపిస్తుంది. మధ్యాహ్నం వేళ హెమింగ్వే నవలో, రాజాజీ రామాయణమో చదువుతుంది. తన విజ్ఞాన దాహాన్ని తీర్చుకుంటూనే విష్ణువరన్‌కి కుడిభుజంలా మెలుగుతోంది.

సాయంత్రం లాన్‌లో కుర్చీలు వేసుకుని టీ తాగుతూండగా విష్ణువరన్ ఆమెను అడిగాడు. "కాకి ముక్కుకు

దొండపండులా యీ సుబ్బారావు నీకెలా నచ్చాడు!"

"ఈ దేశంలో మగవాడు భర్తగా దొరికిందే మహా భాగ్యం, కట్నాలు ఇచ్చుకోలేని ఆడపిల్లకు. నాకు తల్లీ దండ్రీ లేరు. చిన్నప్పట్నుంచీ మేనత్త పెంపకంలో పెరిగాను. ఆమె కొడుకే సుబ్బారావు. ఏదో వర్క్‌షాపులో పని చేస్తుండేవాడు. మా మేనత్తే మా ఇద్దరికీ పెళ్ళి చేసింది. క్రితం ఏడాది ఆమె చనిపోయింది.

ఆమె పోయిన తర్వాత ఉన్న ఇల్లుకాస్త అమ్మి ఆ డబ్బునంతా దుర్వ్యసనాలకు పాడుచేశాడు. డ్యూటీ సరిగా చేయలేదని ఉద్యోగంలోంచి ఊడబెరికారు.

గడవటానికి సంపాదనలేదు. ఉండటానికి ఇల్లులేదు. రెండు నెలలు నరకయాతన పడ్డాం. ఆ తర్వాత మీ నీడలోచేరి మీ దయవల్ల సుఖంగా ఉన్నాం."

"ఏ రకంగా చూసినా వాడు నీకు తగడు."

"నిజమే! కాని అతడికి నా అవసరం ఎంతైనా ఉంది. చిన్నపిల్లాడ్ని సాకినట్టుగా సాకాలి ఆయన్ని. నేను లేకపోతే ఆయనేమైపోయేవారో!"

"నీలాంటి భార్య దొరకటం వాడి అదృష్టం. ఈ మధ్యన వాడు మద్రాసు పోతున్నాడు చాలసార్లు. వాడికి నీవు డబ్బిస్తున్నావా?"

ఆమె ఒక నిమిషం ఆలోచించింది. ఈయన అన్నీ జాగ్రత్తగా గమనిస్తుంటాడు. ఇలాంటి వ్యక్తివద్ద అబద్ధం ఆడి గెలవలేం అనుకుంది.

"అవును. ఇంటి ఖర్చులకని ఇచ్చిన దాంట్లోంచి ఇచ్చాను. అదంతా విడిగా లెక్క రాస్తున్నాను. ఆయనకు ఉద్యోగం దొరకగానే ఇచ్చేస్తాం!"

"నీ విచ్చిగాని వాడికి ఉద్యోగం దొరుకుతుందా?"

“లేకపోతే నేనే ఎక్కడన్నా ఉద్యోగం చేయాల్సి ఉంటుంది మీ పైకం తిరిగి ఇచ్చేందుకు.”

“అంత పని చేయనక్కరలేదు. నీవు నాకు సేవచేస్తున్నందుకు జీతం క్రింద సరిపెట్టుకో డబ్బుని. నీకిదే ఉద్యోగం అనుకో! కాకపోతే నా బాధ అల్లా సుబ్బారావు చేతికి డబ్బిచ్చి చేతులారా వాడ్ని చెడగొడుతున్నానేమో అని!”

ఆమె మాట్లాడలేదు.

“లోపలకు పోదాం పద!” అన్నాడు విష్ణువర్ధన్.

స్ట్రాంగ్ రూమ్ తలుపులు తెరిచాడు. ఆమె వెంటరాగా లోపలకు నడిచాడు. “ఇన్నాళ్ళూ నాకున్న డబ్బుని గురించి వాళ్ళూ వీళ్ళూ చెప్పుకోంగా విని ఉంటావ్. ఇప్పుడు కళ్ళారా చూద్దువుగాని! రా!” అంటూ గోడ మీద స్విచ్ నొక్కాడు. గోడలో మరో భాగం తెరుచుకుంది.

ఎదురుగా చిన్నసైజు ఇనప్పెట్టె ఉంది. తాళం అధునాతనంగా ఉంది. దానిమీద నాలుగైదు వరసల్లో అంకెలున్నై. ఆ వరసల్లో కాంబినేషన్‌గా అంకెల్ని జరిపాడు. ఆ తర్వాత చెవిని దూర్చి త్రిప్పాడు. సేఫ్ తెరుచుకుంది.

మనిషి నిలువెత్తున నోట్లకట్టలు కనిపించినయ్. ఆమె దిగ్భ్రాంతి చెందింది. చేతులు కట్టుకుని నిలబడి ఏ విధమైన ఉద్వేగమూ కనబర్చకుండా వాటిన చూసింది నిశితంగా.

“ఇంత డబ్బుని ఇంట్లో పెట్టుకోకపోతే ఏదన్నా బ్యాంక్‌లో వేసుకోగూడదూ?”

“నా డబ్బుని నేను రోజూ కళ్ళారా చూడాలి. అంతే కాదు. నా వైద్యవృత్తిలో ఎంతో మంది పేద వాళ్ళు మందులు కొనుక్కోలేని స్థితిలో, సరైన వైద్య

సదుపాయం లేక ప్రాణాలు కోల్పోయారు. వాళ్ళందరికీ డబ్బుంటే వాళ్లు బ్రతికి ఉండేవారే. బహుశా అందు చేతనే కాబోలు మనిషి డబ్బుకు దాసోహం అంటు న్నాడు. మానవత్వాన్ని నాశనంచేసి, బానిసల్నిగా మార్చే ఈ డబ్బు అంటే నాకో విధమైన జుగుప్స ఏర్పడింది. అందుకే డబ్బుని నా సేఫ్‌లో బంధించేశాను. ఇప్పుడు ఈ డబ్బంతా నాకు బానిస అయింది కదూ? కాని ప్రజలు నన్నో క్రాక్ అంటారు. సంఘానికి పనికి రాని వాడినని అంటారు.''

''లోకులు కాకులు!'' అంది ఆమె.

విష్ణువర్ధన్ స్ట్రాంగ్ రూమ్ తిరిగి మూసేశాడు.

''నా తదనంతరం ఈ డబ్బంతా మూడు భాగాలవు తుంది. ఒక వంతు ధర్మసత్రాలకు చెందుతుంది. వాటి పేర్లు నా విల్లులో వ్రాశాను. మరో వంతు మెడికల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కి రాసేశాను. మిగతా దాంట్లో నీకు ఎక్కువ భాగం చెందుతుంది. మరికొంత కొద్దిమంది బంధువులకు రాశాను. కాని ఈ విషయం ఎవరికీ తెలియ రాదు.''

''అలాగేనండీ!''

''ఆఖరికి సుబ్బారావుకిగూడా చెప్పకు. ఇప్పుడే తాగి డబ్బంతా నాశనం చేయగలడు.''

''చెప్పనంటే చెప్పను.''

సుభద్ర వంట గదివైపు వెళ్ళిపోయింది. డాక్టర్ విష్ణువర్ధన్ కోటు జేబులో చేతులు పెట్టుకొని పోర్టికోలో పచార్లు చేయసాగాడు. రాములు గేటుకు తాళం వేసి లోపలకు వచ్చాడు.

సరిగా అప్పుడే నల్లరంగు ఫోర్డుకారు అటుగా వెళ్ళింది. అందులోని వ్యక్తి డాక్టర్ వంక గుచ్చి చూస్తున్నాడు.

డాక్టర్ విఘ్నకరన్ అతనికేసి ప్రశాంతంగా చూశాడు. అంతలోనే కారు వెళ్ళిపోయింది. దానిమీద నెంబరు కనబడలేదు సరిగా. కాని అక్షరాల్ని బట్టి అది కర్నాటక రాష్ట్రానికి చెందినది అనుకున్నాడు మనసులో.

6

లాయర్ నారాయణరావు కొడుకు సుధీర్ పదో తరగతి చదువుతున్నాడు. కుర్రవాడు అయిదడుగుల ఎత్తు. సన్నగా ఉంటాడు.

సుధీర్ తమ ప్రక్క యింటి పెరడులోని మామిడి చెట్టు కాయ కోయాలని రాయి విసిరాడు. అది వెళ్ళి కిటికీకి తగిలింది.

లోపల్నుంచి ఎవరో వ్యక్తి "ఏయ్! ఎవరది?" అంటూ అరచుకుంటూ బయటకు వచ్చాడు.

బయటకు వచ్చిన వ్యక్తిని చూస్తూనే సుధీర్ అదిరిపోయాడు. తెలుగు సినిమాల్లో రౌడీలా ఉన్నాడు అచ్చం. గిరజాల జుట్టు, కోరమీసాలు, మొఖాన పెద్ద గంటు, పెద్ద పెద్ద కనుగుడ్లు. అతడిని చూసి ఝడుసుకున్నాడు సుధీర్.

అంతలోనే అతని తండ్రి నారాయణరావు నొడ్లోకి వచ్చాడు. "రేయ్! వెధవా! ఏం పనిరా! రాళ్ళు విసురుతున్నావా కాయలకోసం! ఎవరికన్నా తగలవ్వూ?" అని కోప్పడి, "సారీ సర్! ఆ రాయి ఎవరికీ తగల్లేదు కదా!" అని ఆ వ్యక్తిని పరామర్శించాడు.

అతడు బదులు చెప్పకుండానే లోపలకు వెళ్ళిపోయాడు.

"ఆ ఇంట్లోకి మనుషులొచ్చారని నాకు తెలీదు నాన్నా! ఇంకా ఖాళీగానే ఉందనుకున్నాను. లేకపోతే రాళ్ళు

వినురుతానా!'' తండ్రిని చూసిన సుధీర్ దిక్కు మొగంతో అన్నాడు.

సుధీర్ స్వతహాగా మంచివాడు. అందుకే నారాయణ రావు అతడ్ని మరీ గట్టిగా మందలించలేదు.

పుస్తకాలు తీసుకుని బడికి వెళ్ళిపోయాడు సుధీర్. మేష్టారు పాఠాలు వింటూన్నాగాని అతడి కళ్ళలో ప్రక్కింట్లోంచి బయటకొచ్చిన వ్యక్తి స్వరూపమే గుర్తుకు వస్తోంది.

పుస్తకం మూసేసి అతడ్ని గురించే ఆలోచించ సాగాడు. టెక్స్ట్ పుస్తకంమీద న్యూస్ పేపర్ అట్ట వేసి ఉంది. ఆ న్యూస్ పేపర్ చాలా పాతది.

హఠాత్తుగా దానిమీద ఉన్న ప్రకటన చూసి సుధీర్ పాముని చూసినట్టుగా ఉలిక్కిపడ్డాడు.

ఆ ప్రకటనలో ఒక పెద్ద గజదొంగ ఫొటో ఉంది. అతడి ఆచూకీ ఎక్కడన్నా దొరికితే వెంటనే పోలీసులకు తెలియజేస్తే బహుమతి ఇస్తారని ఉంది.

సందేహం లేదు. ఆ గజదొంగ వీడే. ముమ్మూర్తులా వాడిలానే ఉన్నాడు. తన తండ్రికి ఈ విషయాన్ని తెలియజేసే!

వాడ్ని మరోసారి పరీక్షగా చూసి, వాడే అని నిర్ధారణ చేసుకుని ఆ తర్వాత వాడి అంతు తేల్చుకుంటాను అనుకున్నాడు.

7

జోన్స్ టాక్సీలో మహాబలిపురం వచ్చాడు. బస్ స్టాండ్ కి దగ్గరలో ఉన్న లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. టాక్సీలోంచి మూడు సూట్ కేసుల్ని తీసుకొచ్చి రూమ్‌లో పడేశాడు. స్నానంచేసి నీట్ గా ముస్తాబై తన డైరీలోని

నెంబర్‌కి ఫోన్ చేశాడు.

రాజు పలికాడు అవతలివైపు నుంచి. అతని అడ్రసు చెప్పాడు. జోన్స్ తన సూట్‌కేసుల్ని తీసుకొని రాజు ఇంటికి మారాడు.

బ్యాంక్ దోపిడీలు, లక్షలకోసం మనుషుల్ని హత్య చేయటంలో జోన్స్ ఘటికుడని విన్నాడు రాజు. లోగడ మూడు నాలుగుసార్లు జైలుకెళ్ళొచ్చిన వ్యక్తి. రాజుగూడా జైల్లోనే అతడికి పరిచయమయ్యాడు.

జోన్స్ మనిషి ఎర్రగా ఉంటాడు. పిల్లికళ్ళు. మనిషి నాజూకుగా అయిదున్నర అడుగులు ఉంటాడు. అతడు అటు స్టూడెంట్స్‌లోనూ కలిసిపోగలడు, ఇటు హాలీడే ఎంజాయ్ చేయటానికి వచ్చిన టూరిస్టులానూ అవుపించ గలడు. మనిషి ఎప్పుడూ నవ్వుతూ విచారమనేది ఎరగని వాడిలా కనబడతాడు.

రాజుతోనూ, కనకారావుతోనూ పరిచయాలయాక తనసూట్‌కేస్ తెరిచాడు జోన్స్. అందులో .38 పిస్టల్, ఒకషాట్ గన్ ఉన్నాయ్. రెండు నెక్‌టైలు, గ్లోవ్స్ ఒక జత, సన్నని దారం ఒకరోల్, పెద్దతాడు, కటింగ్ ప్లయర్, రెంచీ సెట్టు, ఇంకా కొన్ని స్క్రూడ్రైవర్లు ఉన్నాయ్.

ముగ్గురు కూర్చుని తమ పథకం గురించి మాట్లాడు కున్నారు.

రాజు బిల్డింగు ప్లాన్ ఒకటి టేబుల్ మీద పరిచాడు. డాక్టర్ విష్ణువర్ధన్ ఇంటి ప్లాన్ అది. ప్రవేశద్వారం ఏ దిక్కున ఉన్నదీ, ఇంటికి ఎన్నెన్ని ద్వారాలున్నవీ స్ట్రాంగ్ రూమ్ లొకేషన్ ఇవి అన్నిటినీ సూచిస్తున్నది అందులో.

జోన్స్ దాన్ని పరీక్షగా చూస్తున్నాడు. రాణి

డ్రింక్స్ కలిపి తెచ్చింది. వాటిని టేబుల్ మీద పెట్టింది. జోన్స్ మావ్ లోంచి తలపైకెత్తి ఆమె వంక చూశాడు.

"ఓ! లవ్ లీ!" అంటూ విజిల్ వేశాడు.

"ఆమె జోలికి పోవటం నీ ఆరోగ్యానికి మంచిది కాదు!" అన్నాడు కనకం.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసుకుని మరీ మాట్లాడు!" అంటూ ఉరిమి చూశాడు జోన్స్.

రాజా అతని వంక చూస్తూ అన్నాడు. "ఆమె నా లవర్! ఆమె వంక కన్నెత్తి చూడవద్దు!"

"లవ్వర్! హహహా!" అంటూ జోన్స్ పెద్దగా నవ్వాడు. "చూడు పార్ట్‌నర్! మనందరం భాగస్థులం కదా! ఆమెనుకూడా తలాకాసేపు పంచుకుందాం! ఆడది రంగంలో లేకపోతే జోన్స్‌కి ఇన్స్పిరేషన్ రాదు."

నేను చెప్పలేదా అన్నట్టు చూశాడు కనకం, రాజా వంక.

రాజు కళ్ళు కోపంతో ఎర్రబడినై.

"జోన్స్! అనవసరంగా రచ్చచేసి మన పథకాన్ని పాడుచేయకు. కావాలంటే బయటకిపోయి పదిమందిని అనుభవించు. అంతేకాని, ఇక్కడ ఎటువంటి గోల చేయకు," అన్నాడు కనకం.

జోన్స్ రెచ్చిపోయాడు. "ఆడదాన్ని చూస్తే వదలడు ఈ జోన్స్. దాన్ని నా ముందుకు రమ్మను వెంటనే! ఊ రమ్మనండి!" అని అరిచాడు.

రాణి భయం భయంగా హాల్లోకి వచ్చింది.

"నువ్వెక్కడికి! ఆగు! అక్కడే!" రాజు కసిరాడు.

"ఇక్కడ అంతా నా ఆజ్ఞలు పాటించాల్సిందే!" జోన్స్ అన్నాడు మళ్ళీ.

"నీవేం బాస్‌వా? ఇంతవరకూ నిన్ను సహించాం!

ఇక మాటమీరితే ఊరుకునేది లేదు!" రాజు అన్నాడు కర్కశంగా.

జోన్స్ తన బొడ్లోంచి కత్తి తీసుకుని రాజుమీదకు దూకాడు. అయితే, కనకం అతడి కాలికి తన కాలు అడ్డంపెట్టి బ్రేక్ వేశాడు.

జోన్స్ క్రింద పడిపోయాడు. అతడి చేతిలోని కత్తి క్రింద పడిపోయింది.

రాజు దాన్ని అందుకున్నాడు. బోర్లా పడిపోయిన జోన్స్ వెన్నులో ఆ కత్తిని బలంగా, కసిగా దించాడు. మళ్ళీ కత్తిని పైకి లాగాడు. మరోపోటు పొడిచాడు.

జోన్స్ బాధతో అరవబోయాడు. కనకం తన బూట్ కాలుని అతడి నోట్లో త్రొక్కి అదిమాడు. మరో శబ్దం బయటకు రాకుండా జోన్స్ చనిపోయాడు.

రాజు కిటికీవైపు చూచి గబాలున ఎలుకమీదకు చప్పుడు కాకుండా దూకిన పిల్లిలా బయటకు పరుగెత్తాడు. చుట్టూ తిరిగి కిటికీవద్దకు వచ్చాడు. మరు నిముషంలో అతడి చేతిలోని కుర్రాడు గిలగిల తన్నుకుంటున్నాడు అతని పట్టు వదిలించుకోవాలని.

ఆ పిల్లవాడ్ని తీసుకొచ్చి నేలమీదకు కుదించి పడే శాడు. నడుముకున్న బెల్టు ఊడలాగి ఆ కుర్రవాడ్ని గదిలోపెట్టి ఛడేల్, ఛడేల్ మని కొట్టాడు.

"అరవకు! అరిచావో ప్రాణాలు తీస్తాను" అన్నాడు రాజు.

ఆ కుర్రవాడు నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు. అతడి నోటి వెంట నెత్తురు కారుతోంది.

రాణి పరుగెత్తుకొచ్చింది. "వాడ్నిగూడ చంపే స్తారా ఏం? పాపం! చిన్న పిల్లవాడు." అంది.

"నువ్వు నోరు మూసుకో!" రాజు కసిరాడు.

"పిల్లవాడా పిడుగా! నాచేయి అంతా కొరికి పెట్టాడు. ఆరోజు మా ఇంటిమీదకు రాయి విసిరింది నీవేగదూ?" రాజు కుర్రవాడ్ని అడిగాడు.

"మామిడి కాయ కొడదామని విసిరాను" ఏడుస్తూ అన్నాడు కుర్రవాడు.

"నీ పేరేంటి?"

"సుధీర్."

"దొంగలాగ మా ఇంట్లోకి ఎందుకు దూరావ్?"

సుధీర్ పలకలేదు.

కనకం అతడి దవడమీద లాగికొట్టాడు. సుధీర్ గిలగిలలాడిపోయాడు.

"నేనెవరో తెలుసా?" రాజు అడిగాడు.

"లే...లేదు!" అన్నాడు సుధీర్.

మరో దెబ్బ పడింది.

"అవును! తెలును! నీ ఫొటో పేపర్లో చూశాను."

"గుడ్ బోయ్! నీకు స్కూల్లో మంచి మార్కులు వస్తుంటాయనుకుంటాను. ఈ విషయం ఇంకా ఎవరెవరికి చెప్పావ్?"

"ఎవరికీ చెప్పలేదు."

కుర్రవాడ్ని మూలకు నెట్టాడు. నేలమీద పడిపోయాడు సుధీర్.

"అతడు పసికట్టిన విషయం ఎవరికీ చెప్పలేదు. ఇంట్లో తెలీకుండా చాటుగా మనింటికి వచ్చాడు. కనుక అతడెక్కడున్నదీ ఎవరికీ తెలియదు."

"ఏం చేస్తారు వాడ్ని?" అని ఆదుర్దాగా అడిగింది రాణి. రాజు, కనకం వంక చూశాడు.

"కాళ్ళూ చేతులూ కట్టి పడేయండి ఈ గదిలో. మన పని పూర్తయేవరకూ వాడు బయట పడకూడదు."

అన్నాడు కనకం.

సూట్ కేస్ తెరచి త్రాడు పట్టుకొచ్చారు. సుధీర్ కాళ్ళు రెండూ కలిపి కట్టేశారు. ఆ తర్వాత చేతుల్ని వెనక్కి విరిచి తాడుతో కట్టేశారు. టేప్ తెచ్చి నోటికి అతికించారు.

రాణి దుప్పటి తెచ్చి పరిచింది. పిల్లవాడ్ని దాని మీదకు దొర్లించి గది తలుపులు బయట గొళ్ళెం పెట్టి హాల్లోకి వచ్చారు, రాజు, రాణి కనకం.

హాల్లో జోన్స్ శవం ఇంకా అలానే పడి వుంది. కనకం అతడి జేబులు వెదికాడు. పర్సు బయటకు తీశాడు. అందులో రెండువందలయాభై రూపాయలున్నై.

“యాభై రాణి కిచ్చేసి మనిద్దరం చెరోవంద తీసుకుందాం!” అన్నాడు కనకం.

రాజు సరేనన్నట్టు తల ఊపాడు.

రాణికి ఇంకా భయం తీరనట్టుగానే బిత్తరపోయి చూస్తున్నది.

కనకం తాడుతో శవంకాళ్ళను గట్టిగా బంధించాడు. ఆ తర్వాత చేతులుగూడా కలిపి కట్టాడు. లోపల్నుంచి పాత దుప్పటి తీసుకువచ్చి దాన్లో ఆ శవాన్ని చుట్టబెట్టాడు.

కనకం,రాజు ఇద్దరూ చెరోవేపు పట్టుకొని ఆ శవాన్ని తీసుకెళ్ళి వెనకాల గదిలో పడేసి తలుపు తాళం వేసేశారు.

“ఈ శవం రెండ్రోజుకల్లా కుళ్ళి వాసన వేస్తుంది. యీలోపుగా మన పని పూర్తిచేసుకొని ఈ ఇల్లు ఖాళీ చేయాలి” అన్నాడు రాజు.

ఇద్దరూ తలలూపారు.

రాజు టేబుల్ మీద ప్లాన్ ని పరిచాడు.

"వాళ్ళింట్లో కేవలం నలుగురే ఉన్నారు. డాక్టర్, ఆ అమ్మాయి, దాని మొగుడు సుబ్బారావు, నౌకరు రాములు. సుబ్బారావు ఒక్కడే అందులో కాస్త ఎదురు తిరిగి పోరాడగలవాడు. వాడ్ని అదుపులో పెడితే చాలు.

"మనం కారు వేసుకుని లోపలకు వెడతాం! స్నేహితులలా ఇంట్లోకి ప్రవేశిస్తాం! ఈ లోపలే టెలిఫోన్ కనెక్షన్ తెంపి పారెయ్యాలి!"

"స్ట్రాంగ్ రూమ్ ఎక్కడుందో తెలుసా?"

"సరిగ్గా తెలీదు. కాని ముసలాడు ఎప్పుడూ ఆ స్ట్రాంగ్ రూమ్ దగ్గరే ఉంటాడట."

"సాయంకాలం పూట అయితే మనకు వీలు. ఊళ్ళో ప్రజలు చాలామంది బీచ్‌లో చేరతారు. రివాల్వరుతో బెదిరించి ముసలాడిచేత సేఫ్ తెరిపిస్తాం. వాడి చేత్తోనే సూట్ కేసుల్ని నింపిస్తాం. వాళ్ళందర్నీ గదిలో బంధించేసి మనం బయటకువచ్చి మనం వేసుకొచ్చిన కారుని అక్కడే వదిలేసి వాడి కారు తీసుకుని మనం బయటపడతాం!"

"బాగానే ఉంది! ఆ తర్వాత మనం ఇక్కడ్నుంచి బయటపడేదెలా?"

"అదీ డెడ్ ఈజీ! ఎందుకంటే మన తలకు క్రాఫ్ హెల్మెట్ లు తగిలించుకుంటాం. కళ్ళకు గాగుల్సు పెట్టుకుందాం. అప్పుడు మనల్ని ఎవరూ గుర్తించరు. బయటికి వచ్చి టూరిస్ట్లలో కలిసిపోతాం!"

"అదీ మంచి ఆలోచనే! ప్లాన్ డాషెయ్యి. ఇక పడుకుందాం!" అన్నాడు కనకం.

తన బెడ్ పరుచుకుని కనకం దానిమీద వాలిపోయాడు. 'రేపు సాయంకాలం! ఎ డేటు రిమెంబర్!'

అనుకున్నాడు మనసులో.

రాజు మెల్లగా నిద్రలోకి జారుకోగానే రాణి అతడి ప్రక్కలోంచి లేచింది.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ బాత్‌రూమ్ ప్రక్క నేవున్న గది తలుపు తీసుకుని లోపలకు వెళ్ళింది.

సుధీర్ దుప్పటిలో పడుకుని ఉన్నాడు. అతడి కళ్ళ వెంట నీళ్ళు ధారలు కారుతున్నయ్.

అతనికి దగ్గరగా మోకాళ్ళమీద కూర్చుంది రాణి. "బాధగా ఉందా?" అని అడిగింది.

"ఊ!" అని మూలిగాడు సుధీర్.

లాలనగా అతడి తల నిమిరింది రాణి.

"వీళ్ళు రాక్షసులు బాబూ! వీళ్ళజోలికి రాకుండా ఉండాల్సింది. మీ నాన్న, అమ్మా నీకోసం బెంగపెట్టుకుంటారు. నీవు ధైర్యంగా ఉండు. వాళ్ళనీకేం ప్రమాదం తలపెట్టకుండా చూస్తాను. రేపు సాయంత్రం వీలుచూసుకుని పారిపోదువు!"

మరో బెడ్‌షీట్, దిండూ తెచ్చింది ఆమె. దిండు అతడి తలక్రింద పెట్టింది. బెడ్‌షీట్ అతని మెడవరకూ కప్పింది.

ఆమె వెళ్ళిపోయింది. ఇలా జరుగుతుందని సుధీర్ ఊహించలేదు. తను ఎక్కడికి వెళుతున్నదీ కూడ తమ్ముళ్ళకిగాని, చెల్లాయికిగాని చెప్పలేదు. అలా చెప్పి ఉంటే వాళ్లు ఇక్కడకు వెతుక్కుంటూ వచ్చేవారు.

కనీసం వాళ్లు తనను పట్టుకున్నప్పుడు పెద్దగా అరిచినా బాగుండేది, నలుగురూ పోగయేవాళ్ళు. మొఖంమీద గంటువున్న వ్యక్తి తనను గట్టిగా పట్టేసుకున్నాడు. ఏదో రెండు తన్ని వదిలేస్తారని అనుకున్నాడు తను.

ఇలా కట్టిపడేసి, అవసరమైతే హత్య చేయటానికైనా వెనుకాడరని చిన్నారి మనసుకు తట్టలేదు.

8

సుభద్ర మళ్ళీ టీ కప్పులో పోసి ఆయనకు అందించింది.

డాక్టర్ విష్ణువర్ధన్ టీని చప్పరిస్తూ అన్నాడు. "నీవు ఈ ఇంట్లో అడుగుపెట్టిన నాటినుంచి ఏదో కొత్త అనుభూతి కలిగింది నాలో. జీవితంలో నా అన్నవాళ్ళు లేక మోడులా జీవించానేమో, ఆప్యాయత అంటే ఏమిటో నీవొచ్చాకనే తెలిసింది నాకు. గత అయిదారేళ్ళ జీవితంతో పోల్చిచూస్తే ప్రస్తుతం నా జీవితం ఆనందంగా గడిచిపోతోంది.

"కాని ఒక్కొక్కప్పుడు భయమేస్తోంది. తుఫానుకు ముందు ఆవరించే ప్రశాంతతలాగ ఈ ఆనందమయ దినాలు రాబోయే ఆపదలకు సోపానాలేమో అనిపిస్తుంది. సుభద్రా! ఏదైనా పుస్తకం తీసుకురా! కాసేపు ఈ ఆలోచనల్ని దూరంగా తరిమేద్దాం!"

"శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద చదవనా?"

"అది వద్దు. విశ్వనాథవారు రచించిన చెలియలికట్ట తీసుకురా! రాక్‌లో మూడోవరసలో చివరగా ఉంటుంది."

సుభద్ర లోపలకువెళ్ళి పుస్తకం తెచ్చింది. కాసేపు చదివి వినిపించింది. ఆమె ఎంతో స్ఫుటంగానూ, నిర్దుష్టంగానూ చదువుతుంది. ఎక్కడికక్కడ సమాసాల్ని ఆపి, భావయుక్తంగా చదువుతుంది. అందుకే ఆమె పుస్తకం చదువుతూంటే అతడు ఎంతో ఆనందిస్తాడు.

విష్ణువర్ధన్ పడుకున్న తర్వాత సుభద్ర తన గదిలోకి వచ్చింది. తను రోజూ చదివే ఎన్నో పుస్తకాల్లోని

సాహిత్యాన్ని సుబ్బారావుకు చెబుదామనుకుంది.

"ఎప్పుడూ పుస్తకాలు? సాహిత్యం? ఏముంటుందా పుస్తకాల్లో! మీరిద్దరూ పుస్తకాల పురుగుల్లాగున్నారు!" అని విసుక్కున్నాడు సుబ్బారావు.

"ఒకసారి మీరూ చదివితే వాటిని మళ్ళీ వదులుతారా?" అంది సుభద్ర.

"పిచ్చిదానా? పురాణాలూ, పుస్తకాలు ముసిలాళ్ళకు. నీకూ, నాకూ పనికిరావు. జీవితమంటే ఏమిటో చూపిస్తాను. రా!" అంటూ ఆమెను తనమీదకు లాక్కున్నాడు.

"ఆగండి! ఏమిటా మోటుసరసం! నన్ను చెప్పనివ్వండి ముందు!" అని వారించింది సుభద్ర.

"చాల్లే! ఆపు నీ సొద! ముసలాడు నీ మాట వింటున్నాడు గదా! వాడిచేత ఏ టెలివిజన్ సెట్టో కొని పారేయిస్తే మనకు బోలెడంత కాలక్షేపంగదా. అలాంటి మంచి పనులు చెయ్యావు. వేలకువేలు తగలేసి పుస్తకాలు మాత్రం కొని పడేస్తుంటాడు."

ఆమె ఏదో చెప్పబోయింది. అతడా అవకాశాన్ని ఆమెకివ్వకుండానే ఆమెను తన కౌగిట్లో ఇముడ్చుకున్నాడు.

9

రాణి దుప్పటి గొంతువరకు కప్పుకుని పడుకుంది. ఆమెకు నిద్రరావటంలేదు. ఆమె ప్రక్కనే రాజు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

రాణి ఆలోచనలన్నీ ఆ పసివానిమీదే ఉన్నాయ్. ఈ రోజు వాడ్ని హాత్యజరిగింది తలవని తలంపుగా. ఆ తర్వాత అమాయకుడైన సుధీర్‌ని తెచ్చి కట్టిపడేశారు. నీసం అతన్నన్నా ప్రాణాలతో వదిలితే బాగుండును.

ఆమె ఆలోచనలు వెనక్కి మళ్ళినయ్.

తను ఎలిమెంటరీ స్కూల్ టీచర్ కుమార్తె. ఆరుగురు సంతానంలో మూడోది. ఇద్దరక్కలు, ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళ సంసారంలో చాలీచాలని జీతంతో జీవితం చాల దుర్భరంగా ఉండేది. తనకు మొదటినుంచి సినిమాలంటే తగని పిచ్చి. రిలీజ్ అయిన ప్రతి సినిమా చూసేది. చిన్నతనంలో నాన్న జేబులో డబ్బులు దొంగతనంగా తీసేది సినిమాకని.

హైస్కూల్లో చేరిన తర్వాత మరో సదుపాయం కలిగింది. తనంటే మోజుపడే కుర్రకారువాళ్లు తనని ప్రతి సినిమాకు తీసుకెళ్ళేవారు. తను తన్మయత్వంతో సినిమా చూస్తుంటే వాళ్లు తన దేహంలో ఎక్కడెక్కడో తడిమేవారు. తను అడ్డం చెప్పేది కాదు. చెబితే తనకు ఫ్రీ సినిమాలు పోతాయని. వాళ్ళని ముద్దుపెట్టుకోనిస్తే పౌడరు డబ్బాలు, రిబ్బన్లూ గాజాలకు డబ్బులొచ్చేవి. అలా ప్రారంభమయింది తన తొలి యవ్వనపు రోజులు.

ఒకసారి తన బోయ్ ఫ్రెండ్ తనను సినిమాల్లో చేరుస్తానని మభ్యపెట్టి ఇంట్లోంచి లేపుకుపోయాడు. ఇద్దరూ మద్రాసు చేరారు. అతగాడికి ఫిల్మ్ స్టుడియోల్లో వ్యక్తులు తెలుసు. అందుకని తను నాలుగైదు స్టుడియోలు, సినిమా షూటింగ్లు చూడగలిగింది.

ఒకనెల తనను అనుభవించిన తర్వాత ఆ ఫ్రెండ్ తనను మరో వ్యక్తికి అప్పజెప్పి పరారయ్యాడు.

ఆ కొత్త పార్ట్నర్ ఏదో స్టుడియోలో మేకప్ మెన్ క్రింద అసిస్టెంట్. అతడి ప్రయత్నాన అని తనకు ఒక సినిమాలో పోర్షన్ దొరికింది. తన ఆనందానికి అవధిలేదు.

అయితే సెన్సార్ కత్తెరకు తనున్న సీన్ కాస్త బలి అయింది. వెండి తెరమీద కనుపించాలన్న తన ఆశ

అడియాసే అయింది.

ఈ లోపల తనను ఎందరో చేతులు మార్చారు.

సరిగ్గా అటువంటి సమయంలో రాజు తారసిల్లాడు. "ఈ సినిమాలోకం కేవలం పైమెరుగుల వల్లు మాత్రమే. హాయిగా ఒకడితో స్థిరపడు! స్టార్ అవాలనే ఎండమావుల్లో ఎందుకు పరుగెత్తుతావ్!" అని సలహా ఇచ్చాడు.

సినిమా ఛాన్స్‌లకోసం అడ్డమైన వాడి దగ్గరా పడుకుని ఇప్పటికే తను ఆరోగ్యం పాడుచేసుకుంది. అందుకే రాజుతో ఉండిపోయింది.

రాజు ఏదో కంపెనీలో పనిచేస్తున్నానని చెప్పాడు. కాని ఒకసారి అతడికోసం పోలీసులు వచ్చారు. దాంతో అతడు దొంగ అని తెలుసుకుంది. హత్యలు చేయడానికి కూడా వెనుకాడని వ్యక్తి అని తెలిసింది.

అయినా అతడితోనే జీవితాంతం గడిపివేయాలనుకుంది.

ఇక్కడకు వచ్చేటప్పుడు రాజు తనను ఎంతగానో బ్రతిమాలాడు. ఎన్నో విధాల నచ్చచెప్పాడు.

ఎవరో ధనికుడింట్లో దొంగతనం చేయబోతూన్నట్టు చెప్పాడు. ఇదే ఆఖరి నేరం అన్నాడు. ఈ పని సఫలం అయితే మిగతా జీవితమంతా నేరం చేయాల్సిన అవసరం ఉండదని వక్కాణించాడు.

తను సరేనని అతడి వెంటే వచ్చింది.

అతడు నేరస్థుడే కావచ్చు. హంతకుడు అవచ్చు. కాని తనను భార్యకన్న మిన్నగా చూసుకుంటున్నాడు. అతడి పాలనలోకి వచ్చాక తను మరో పరాయివాడి కోర్కె తీర్చి బ్రతకాల్సిన ఖర్మ తప్పింది.

ఈ ఒక్కసారి రాజు పథకం నెరవేరితే బాగుండును

అని మనసులోనే దేవుడిన్ని ప్రార్థించింది.

ఆ తర్వాత ఆమె కనురెప్పలు బరువుగా వాలిపోయినయ్.

10

లాయరు నారాయణరావు ఇంటికి చేరేసరికి బాగా పొద్దుపోయింది. పిల్లలు అన్నాలు తిని పడుకున్నారు.

నారాయణరావు భార్య సరసనే కూర్చుని తీరిగ్గా తృప్తిగా భోజనం పూర్తిచేశాడు. స్టడీ రూమ్‌లోకి వెళ్ళి ఆ రోజే పోస్టులో వచ్చిన లా జర్నల్ తిరగేశాడు. భార్య వంటిల్లు సర్ది వచ్చింది.

"పిల్లలంతా పడుకుంటే ఎంత ప్రశాంతంగా ఉంది! వెళ్ళి అలా ఆరుబయట వెన్నెల్లో కూర్చుందాం!" అన్నాడు నారాయణరావు.

"పాపం! మీరు మరీ చిన్నవారైపోతున్నారు ఈ మధ్య" అంది నారాయణరావు భార్య సరోజ.

ఇద్దరూ వరండాలోంచి నడిచివెళ్ళి చెట్ల క్రీనీడలో గడ్డిమీద కూర్చున్నారు. బయట పిండారబోసినట్లుగా వెన్నెల కాస్తూంది. సరోజ తలలోని మల్లెచెండు వాసన అతని వేపుకు మత్తుమత్తుగా వీస్తున్నది. అతడి చేతులు ఆమెచుట్టూ తిరిగినయ్. అతని చేతుల్లో వెన్నముద్దలా ఆమె కరిగిపోయింది.

ప్రక్కనేవున్న బంగళాలో ఇంకా లైట్లు వెలుగుతున్నయ్.

సరోజ చీర సవరించుకుని ఇంట్లోకి వచ్చింది. ఆమె వెనుకనే నారాయణరావుగూడ వచ్చాడు.

తలుపు లోపల గడియపెట్టి తాళం వేశాడు. అన్ని గదుల తలుపులువేసి ఉన్నాయో, లేదో చెక్ చేసి బెడ్

రూమ్‌లోకి వచ్చాడు.

ఇంట్లో పిల్లలు ఇద్దరే నిద్రపోతూ కనుపించారు.

"సుధీర్ ఏడీ?" అని అడిగాడు నారాయణరావు.

"వాడి గదిలో ఇంకా చదువుకుంటున్నాడేమో!" అంది సరోజ. ఆ పూట వాడు భోజనానికికూడా రాలేదని అప్పుడు జ్ఞప్తికి వచ్చింది ఆమెకు.

ఇద్దరూ ఆత్రుతగా సుధీర్ చదువుకునే రూమ్‌లోకెళ్ళి చూశారు. లైటు వెలుగుతూనే ఉంది. పిల్లవాడు లేడు. ఎక్కడికెళ్ళినట్టు? ఏమయినట్టు?

సామాన్యంగా చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు సుధీర్. ఆఖరుకు బడికి వెళ్ళేటప్పుడుగూడా "అమ్మా! బడికెళ్తున్నా" అనిచెప్పి మరీ వెళ్ళే అలవాటు వాడికి.

"ఏదన్నా సినిమాకు వెళ్ళాడేమో!"

"అదీ లేదండి. వాడు సాయంత్రంనుంచే కనపడలేదు!" అన్నది సరోజ ఏడుపు దిగమింగుకుంటూ.

దూరంగా సముద్రపు అలలు ఉవ్వెత్తుగా లేచి పడుతున్నయ్. ఎవరన్నా ఫ్రెండ్స్‌తో సముద్ర స్నానానికి పోయి ప్రమాదానికి గురికాలేదుగదా అన్న భయం ఇద్దర్లో కలిగింది.

"ఎవరింట్లోనన్నా చదువుకోవడానికి వెళ్ళాడేమో! కనుక్కొని వస్తాను. నువు తలుపేసుకో!" అంటూ నారాయణరావు సైకిల్ వేసుకుని సుధీర్ క్లాస్‌మేట్స్ అందరిళ్ళలోనూ అడిగివచ్చాడు.

ఎవరినడిగినా తమ ఇంటికి రాలేదంటే తమ ఇంటికి రాలేదన్నారు.

విచారంతో నారాయణరావు ఇంటికి తిరిగివచ్చాడు.

"వాడిజాడ ఎక్కడా తెలీలేదు సరోజా!" అన్నాడు

దిగులుగా.

"అయ్యో! నా బాబుకేమయిందో ఏమోనండీ! నాకు భయమేస్తోంది" అంటూ శోకాలు పెట్టింది సరోజ.

"ఊరుకో సరోజా! రేపుదయం అన్నా రాకపోతాడా? రాకపోతే అప్పుడే పోలీసు రిపోర్టు ఇద్దాం. నలుగుర్నీ పోగుచేసి వెదుకుదాం!" అని ఊరడించాడు నారాయణ రావు.

సరోజ దుఃఖంతో ఏడుస్తూన్నది. నారాయణరావు ఊరడించినకొద్దీ ఆమె దుఃఖం ఎక్కువైపోతున్నది.

నారాయణరావు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు. ఇన్స్పెక్టర్ ఆర్ముగం అతడి స్నేహితుడే.

"ఇన్స్పెక్టర్ మా అబ్బాయి కనిపించటం లేదు!" అన్నాడు జీరబోయిన కంఠంతో.

"అయ్యో పాపం! ఏదైనా సినిమాకు వెళ్ళాడేమో కనుక్కున్నారా?" ఇన్స్పెక్టర్ సానుభూతిగా అడిగాడు.

"లేదు! అతని స్నేహితులందర్నీ వాకబు చేశాం. అసలు రాత్రి భోజనాల టయిమ్ వరకూ ఇంట్లోనే ఉన్నాట్ట. ఆ తర్వాత నుంచి అతని జాడలేదు."

"ఎన్నేళ్ళుంటాయ్?"

"పధ్నాలుగేళ్ళు! పేరు సుధీర్. పదోక్లాసు చదువుతున్నాడు."

"ఇదివరకు ఎప్పుడన్నా ఇలా ఇంట్లోంచి మాయమయాడా?"

"లేదు ఇన్స్పెక్టర్! వాడు చాలా మంచి నడవడి కలవాడు. ఇంట్లో చెప్పకుండా ఎక్కడికీ పోడు."

"ఆల్‌రైట్! వెళ్ళేటప్పుడు ఏ డ్రెస్ వేసుకున్నాడో చెప్పండి. అనవాళ్ళుగూడా చెబితే వెదికిస్తాం!"

నారాయణరావు వివరాలు చెప్పాడు.

పోలీస్ స్టేషన్ నుంచి నారాయణరావు భారంగా అడుగులు వేసుకొంటూ సముద్రపు ఒడ్డుకు వెళ్ళాడు. తీరం వెంటే నడుస్తూ అలల వైపుగా చూశాడు చాలాసేపు.

'అలా జరిగి వుండదు. వెంట తోడు లేకుండా సముద్రస్నానం ఎన్నడూ చేయడు' అనుకున్నాడు మనసులో.

ఇంటికి చేరుకున్నాడు. వరండాలో సరోజ తన కోసమే ఎదురు చూస్తున్నది. తనను చూడంగానే తన గుండెలమీద తలవాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఊరుకో! సరోజా! రేపీపాటికి సుధీర్ మన చేతుల్లో ఉంటాడు!" అని ఊరడించాడు.

11

రాజా మేలుకున్నాడు. ఉదయకిరణాలు కిటికీలోంచి గదిలోపడి గదంతా వెలుగుని విరజిమ్ముతున్నయ్.

రాజు లేచాడు బెడ్ మీదనుంచి. ఉదయిస్తున్న సూర్యుడి వంక చూశాడు. ఎర్రగా అగ్నిగోళంలా అప్పుడే పైకి వస్తున్నాడు.

ఈ రోజు తన జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించ వలసిన రోజు. రేపువుదయానికి తను అత్యున్నత స్థితిలో లక్షలకు వారసుడయిపోతాడు.

తన ప్రక్కలో రాణిలేదు. ఆమె తనకంటే పెందల కడే లేస్తుంది. బహుశా బాత్‌రూమ్‌లోనో, వంట గది లోనో వుండి వుంటుంది. ఎందుకో అతనికి అనుమానం వేసింది. లేచి వంట గదిలోకి వెళ్ళాడు. ఆమె అక్కడ లేదు. బాత్‌రూమ్ వంక చూశాడు. ఆ తలుపు తీసే వుంది.

ప్రక్కగది తలుపు తెరిచి వుంది. బహుశా ఆపిల్ల వాడ్ని విడిపించిందేమో అని భయపడ్డాడు. తమ పని అయ్యేదాకా వాడు బయటికి వెళితే పోలీసులకు తమ గురించి తెలిసిపోతుంది. తమ ప్లాను అంతా పాడైపోతుంది.

రాజు లేవకముందే రాణి నిద్రలేచింది. వంట గదిలోకి వెళ్ళి మిల్క్ పౌడర్ కలిపి పాలు తయారుచేసింది. చక్కెర కలిపింది. అల్మరా తెరచి బ్రెడ్ తీసింది. లోపలకి నడిచింది.

సుధీర్ అప్పటికే నిద్రలేచాడు. కళ్ళు తెరుచుకుని నిస్సహాయంగా పడుకొని వున్నాడు.

రాణి అతని దగ్గరే కూర్చుంది.

"ఆకలిగా వుందా?"

అవునన్నట్లు తలవూపాడు.

"నీకు పాలు తెచ్చాను. కాని నీ నోటి ప్లాస్టరు తీశాక నీవు అరచి గోల చేయకూడదు. చేశావో వాళ్ళు వచ్చి నిన్నూ, నన్నూ ఇక్కడికిక్కడే చంపి పాతేస్తారు! సరేనా? అరవవు కదూ?"

అరవను అని తల అడ్డంగా వూపాడు.

అతడి నోటికున్న ప్లాస్టర్ లాగేసింది రాణి. అతడికి కొంచెం బాధ కలిగింది. అయినా ఓర్చుకుని అరవకుండా వుండ గలిగాడు.

అతడు పడుకున్న దుప్పటి అంతా తడిసిపోయింది. ప్రక్కలోనే మూత్రవిసర్జన చేసుకున్నట్టున్నాడు పాపం అనుకుంది. అతడ్ని ప్రక్కకు దొర్లించి ఆ దుప్పటి మార్చి మరో దుప్పటి పరిచింది.

అతడ్ని కూర్చోబెట్టి పాలు త్రాగించింది. బ్రెడ్ ముక్కలు త్రుంచి నోట్లో పెడుతోంది.

సరిగా అదే సమయానికి రాజు తలుపు నెట్టుకుని

లోపలకు వచ్చాడు.

అతడ్ని చూసి రాణి అమలా వణికిపోయింది.

"ఏం చేస్తున్నావ్ ఇక్కడ!" అరిచాడు రాజు.

"ఆకలిగా వుందేమోనని కొంచెం రొట్టె ఇస్తున్నాను" అంది తప్పుగా స్వరంతో.

"నువ్వంటే మచ్చిక అయినట్టున్నాడు! అరచిగోల చేయలేదు! ఇక మరోసారి ఎప్పుడూ నాతో చెప్పకుండా వీడి దగ్గరకు రావద్దు."

"అలాగే!"

అతడి నోటికి మళ్ళీ ప్లాస్టర్ అంటించాడు రాజు. ఇద్దరూ బయటకు నడిచారు.

12

రాణి ఇల్లంతా నీళ్ళుపోసి కడిగింది. అలమార్లు, తలుపులు అన్నీ తడిగుడ్డతో శుభ్రం చేసింది. దేనిమీదా వాళ్ళ వేలి ముద్రలు దొరక్కుండా ఇల్లంతా అనుమానమున్న చోటల్లా తుడిచింది.

కనకం హోటలుకెళ్ళి క్యారియర్ భోజనం తెచ్చాడు. ముగ్గురూ ఆరగించారు.

ఆఖరి ఘట్టం ప్రదర్శించే నటులలాగా అంతా రెడీ అయ్యారు.

కనకం మళ్ళీ బయటకు వెళ్ళాడు. బస్ స్టాండ్ కు దగ్గర్లో ఒక టీ స్టాల్ ముందు బెంచీమీద కూర్చున్నాడు.

ఆ పూట సుబ్బారావు మద్రాసు వెడతాడని అతడికి తెలుసు. సుబ్బారావు ఈ మధ్య సవేరాలో 'జూలీ' కేబరే డ్యాన్సుకి వెళ్ళటానికి అలవాటు పడ్డాడు. ఈ రోజుగూడా సవేరా హోటల్లో ఆమె డ్యాన్స్ ప్రోగ్రాం వుంది,

సుబ్బారావు మధ్యాహ్నం వేళకు బస్సుస్టాండ్‌కి వచ్చాడు.

కాని అతడు ప్రయాణ సన్నాహంలో లేడు. జరిగిందేమంటే, భార్య సుభద్రని డబ్బు అడిగితే లేదంది. ఆమె మీద అలిగి కాసేపు అలా బయటకన్నా పోయివద్దామని బస్‌స్టాండ్ కేసి వచ్చాడు.

అతడ్ని చూస్తూనే కనకారావు, సుబ్బారావు దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా పలకరించాడు.

"హాలో బ్రదర్! ఇక్కడున్నావేంటి నీవూను! పిక్‌నిక్‌కి వచ్చావా ఏమిటి?" అని ప్రశ్నించాడు.

సుబ్బారావు అతడ్ని తేరిపార చూశాడు.

"అదేమిటి అలా చూస్తావ్! సవేరా హోటల్లో జూలీ కాబరే ప్రోగ్రాంకు మనిద్దరం చాలాసార్లు ఒకే టేబుల్ దగ్గర కూర్చున్నాం. గుర్తురాలేదా?"

'సవేరా', 'జూలీ' అనే పేర్లు అతివేగంగా పనిచేసినయ్ అతడిమీద. ఒకవేళ అతడు చెప్పేది నిజమేనేమో! తనూ అతడూ ఒక టేబుల్ దగ్గర కూర్చుని ఉండచ్చు. తనకి సరిగా గుర్తులేదు. క్యాండిల్ లైటులో అతని ముఖాన్ని తను సరిగాచూసి ఉండకపోవచ్చు. అదీగాక అందరిదృష్టి జూలీ నునుపైన అవయవాలమీద ఉంటుంది. ప్రక్కన మగవాళ్ళ ముఖాలుచూసే తీరిక ఎక్కడ.

"అవునవును! నేను సరిగా పోల్చుకోలేకపోయాను! ఏమిటి మీరిలా వచ్చారు!"

"నేనూ మా ఫ్రెండ్ ఇద్దరం కారులో కంచిచూసి వస్తూ ఇక్కడ ఆగాం. సాయంత్రానికి మద్రాసు చేరాలి. జూలీ ప్రోగ్రాం మిస్ అయితే ఎలా?" అన్నాడు కనకం నవ్వుతూ.

"బ్రదర్! మీరు మరోలా అనుకోకుండా ఉంటే

సాయం లిఫ్టు ఇవ్వగలరా?" సంశయిస్తూ అడిగాడు సుబ్బా రావు.

"ఆ మాట అడగడానికి సందేహిస్తారేం! ఉయ్ ఆల్ ఆర్ ఫ్రెండ్స్! తప్పకుండా రండి!" అన్నాడు కనకం.

సుబ్బారావు ఆనందానికి అవధుల్లేవు. కాకపోతే పవే రాల్లో దిగటానికి డబ్బుకావాలి. అందాకా వెళ్ళాక పర్సు మరిచిపోయి వచ్చాననో, లేక జారిపోయిందనో బొంకవచ్చు. ఆ తర్వాత వాళ్ళే తననూ తీసుకుపోతారు లోపలికి అనుకున్నాడు.

"రండి! వెడదాం! మా ఫ్రెండ్ అతనికి తెలిసినవాళ్ళ ఇంటిదగ్గర ఉంటానన్నాడు!" అంటూ కనకం దోవ తీశాడు. అతడు కనకాన్ని అనుసరించాడు.

ఇద్దరూ రాజు బంగళాలోకి వెళ్ళారు. రాజు వీళ్ళ కోసమే ఎదురు చూస్తున్నాడు ఆత్రంగా. సుబ్బారావు వెనుకగా నడుస్తూ కనకం కన్నుగీటాడు. రాజు అంతా సక్సెస్ అయిందని సంతోషపడ్డాడు.

రాణి బాటిల్స్ తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

"కొంచెం ఔషధం సేవించి బయలుదేరుదాం సుబ్బా రావుగారూ!" అన్నాడు కనకం.

"ఓ! దానికేం? నేనూ రెడీ!" అన్నాడు సుబ్బారావు.

గ్లాసులు నిండినయ్. సుబ్బారావు వెంటవెంటనే త్రాగు తున్నాడు. అతడికి ఎదురుగా మరో గదిలో రాణి బట్టలు మార్చుకుంటోంది. ఓరగా వేసి ఉన్న తలుపు సందులోంచి సగం సగం నగ్నశరీరం కనబడుతోంది. మత్తు ఆవరిస్తున్న కొద్దీ అతడికి నిషా ఎక్కుతోంది.

వెనుకనుంచి అతడి తలమీద గట్టి దెబ్బపడింది. అంతే! అతడు స్పృహతప్పి పడిపోయాడు.

రాజు గుడ్డపేలికలను నీళ్ళలో తడిపి వెంటనే అతడి

తలకు కట్టుకట్టాడు.

ఆ తర్వాత ముగ్గురూ గబగబ పనిచేయసాగారు. ఎవరో వెనుకనుంచి తరుముతున్నంత వేగంగా సామాన్లన్నీ సర్ది కారులో పెట్టారు.

చేతులకు సర్జికల్ గ్లోవ్స్ తొడుక్కున్నారు. తలకు క్రాప్ హెల్మెట్స్ తగిలించుకున్నారు. కూలింగ్ గాగుల్స్ పెట్టుకున్నారు. ఈ కొత్త మేకప్‌లో ఎవరూ తొందరగా గుర్తించలేరు.

సుబ్బారావుని చెరొక వేపు పట్టుకుని కార్లో పడేశారు.

ఇంట్లో తమకు సంబంధించిన సామాన్లు ఏవీ లేవని నిర్ధారణ చేసుకున్నారు. డ్రైవింగ్ సీట్లో కనకం కూర్చున్నాడు. అతని ప్రక్కనే రాజు కూర్చున్నాడు. వెనుక సీట్లో సుబ్బారావు ఒళ్ళు తెలీకుండా మైకంలో పడి ఉన్నాడు.

రాణి కారులో ఎక్కటానికి తడబడుతూన్నది.

"ఏమిటాలస్యం! త్వరగా ఎక్కు! వాడికి మళ్ళీ తెలివి వస్తే ఇబ్బంది!" అని కసురుకున్నాడు రాజు.

"ఒక్క నిమిషం! టాయిలెట్‌లోకి వెళ్ళొస్తాను" అంది రాణి.

"కానీ! త్వరగా ఏడు! మీ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కే ఇది" అని విసుక్కున్నాడు.

రాణి లోపలకు పరుగెత్తింది. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి టాప్‌ని పూర్తిగా తిప్పింది. నీళ్ళు పెద్ద శబ్దంచేస్తూ బేసిన్‌లో పడుతున్నయ్.

రాణి ప్రక్కగదిలోకి నడిచింది. సుధీర్ కళ్లు తెరుచుకుని పైకప్పుకేసి చూస్తూ పడుకున్నాడు.

అతడి నోటికి అతికించివున్న ప్లాస్టర్ని గభాల్న పీకేసింది. కాలికి కట్టివున్న తాడు ముడి విప్పింది. చేతులకి

వున్న కట్లుగూడ ఊడదీసింది.

“వాళ్ళు బయటికి వెళ్ళిపోతున్నారు. ఒక అరగంట ఇలాగే ఇక్కడే ఉండిపో. ఆ తర్వాత గోడదూకి మీ ఇంట్లోకి వెళ్ళు. ఎవ్వరికీ ఏమీ చెప్పకు. ఏం?” అంది రాణి.

అలాగే అన్నట్టు సుధీర్ తల ఊపాడు.

గది తలుపు దగ్గరగాలాగి, రాణి వంటగది దాటుకుని హాల్లోంచి బయటకు పరుగెత్తింది.

కారు డోర్ లాగి వెనకసీట్లో సుబ్బారావు ప్రక్కగా కూర్చుంది.

“రైట్!” అంది రాణి.

కారు స్టార్టయింది. సాయంత్రం నాలుగవుతోంది. రోడ్లమీద జనసంచారం అట్టేలేదు.

13

డాక్టర్ విష్ణువర్ధన్ ఇంటిముందు కారాగింది.

కనకం గేటుముందు నిలబడి పెద్దగా అరిచాడు.

“ఎవరయ్యా లోపల! త్వరగా రండి! సుబ్బారావట! మీ మనిషికదా! స్పృహతప్పి రోడ్డుమీద పడిపోయాడు.”

లోపల్నుంచి రాములు పరుగెత్తుకొచ్చాడు. తాళంతీసి గేటు తెరిచాడు.

కారు లోపలకు వచ్చింది.

ఇంతలో సుభద్రగూడ బయటకు వచ్చింది.

కనకం, రాజు ఇద్దరూ సుబ్బారావుని చేతులమీద లోపలకు తీసుకువెళ్ళారు. సుభద్ర ఆతృతగా వాళ్ళకు దోవచూపింది.

డాక్టర్ విష్ణువర్ధన్ గదిలోకి తీసుకెళ్ళి బెడ్ మీద పడుకోబెట్టారు. విష్ణువర్ధన్ అతడికి వైద్యంచేసే పనిలో నిమగ్నుడయ్యాడు.

రాణి కారుని రివర్స్ చేసింది. లోపల్నుంచి వాళ్ళు రాగానే పారిపోవటానికి వీలుగా ఉండటానికి.

కారులోంచి తాడుతీసింది. ఆ తాడుకి చివర చిన్న రాయి ఉంది. ఆ రాయి పుచ్చుకుని తాడు మధ్యలో పట్టుకుని రాయిని టెలిఫోన్ తీగలమీదకు విసిరింది. తాడు తీగలమీదుగా క్రిందకు వ్రేలాడుతోంది. తాడు రెండు కొనల్ని పుచ్చుకుని తన బలంకొద్దీ లాగింది. టెలిఫోన్ తీగలు తెగి చివరలు నేలమీద ఆనుతూ ఉన్నయ్.

“ఏయ్ అమ్మాయ్! ఏమిటా పని!” అన్నాడు రాములు. ఆమె కొంటెతనానికి ఆ పని చేస్తున్నదని అనుకున్నాడు అతడు.

“ఇలారా మాట!” అంది రాణి.

ఏదో రహస్యం వినేవాడిలా అతడు దగ్గరకు వచ్చాడు. వెనుకగా దాచిన పెద్ద రెంచీతో అతడి తలమీద మోదింది.

అతడు “అబ్బా!” అంటూ పడిపోయాడు. అతడ్ని లాక్కువెళ్ళి గోడవారగా చెట్లల్లో పడేసింది.

గేటు దగ్గరకు వెళ్ళి బార్లా తెరిచింది. రివాల్వర్ని తన ప్యాంటు జేబులోదాచుకొని రెడీగా కారుదగ్గరే నిలబడింది.

రాజు తనచేతిలో పిస్టలు చూపిస్తూ “హాండ్సప్! ప్రాణాలమీద ఆశవుంటే కదలద్దు!” అని అరిచాడు.

కనకం మరో పిస్టలుతో సుభద్రను పొదివి పట్టుకున్నాడు.

స్టెతస్కోప్ జారవిడిచి విష్ణువర్ధన్ చేతులు పైకెత్తి నిలబడ్డాడు.

“డాక్టర్! మాకు అనవసరంగా రక్తపాతం కలిగించటం ఇష్టంలేదు. త్వరగా మీ సేఫ్ తెరవండి!” గర్జిం

చాడు రాజు.

"మిస్టర్! మీరేంచేసినా ఫర్వాలేదు. కాని నేను హార్ట్ పేషెంట్ ని. నాకేమాత్రం ఆదుర్దా కలిగించినా నాకు హార్ట్ ఎటాక్ వస్తుంది. ఆ తర్వాత సేఫ్ ఎలా తెరవాలో ఎవరూ చెప్పలేరు!"

"ఆల్ రైట్! కనకం! ఆ అమ్మాయిని వివస్త్రని చెయ్యి. అతడు మాటలతో లొంగడు!" అన్నాడు రాజు.

డాక్టర్ విష్ణువర్ధన్ మ్రాన్పడిపోయాడు. తనను సేఫ్ రహస్యం చెప్పమని చిత్రహింసలు పెట్టినా ఓర్చుకోవాలి. వాళ్ళకా రహస్యం చెప్పగూడదు అనుకున్నాడు. కాని వాళ్లు తనను వదిలేసి, సుభద్రను పట్టుకున్నారు. తన యావదాస్తిపోయినా సరే కాని, ఆమెకు హాని జరిగితే తను భరించలేడు.

"ఆగండి! సేఫ్ ఎలా తెరవాలో చెబుతాను. మూడూ, ఏడూ, రెండు త్రిప్పండి" అంటూ తాళాలు ఇవ్వబోయాడు.

"సేఫ్ని తాకంగానే మాకు ఎలక్ట్రిక్ షాక్ తగలాలనా? ఆ పప్పులేం వుడకవ్. సేఫ్ తెరు!"

డాక్టర్ విష్ణువర్ధన్ సేఫ్ దగ్గరకు నడిచాడు. స్విచ్ బోర్డుమీది ఒక స్విచ్ని క్రిందకు నొక్కాడు. ఆ తర్వాత స్ట్రాంగ్ రూమ్ తాళం తీశాడు. షట్టర్ పైకి లేచింది.

అతడి వెన్నులో రివాల్వర్ని గ్రుచ్చిపట్టి లోపలకు వెళ్లాడు రాజు.

నెంబర్ లాక్లో రెండు మూడు వరసలు త్రిప్పాడు. కీహోల్లో తాళంచెవి దూర్చి త్రిప్పాడు. సేఫ్ తలుపుని బలంగా లాగాడు. ఆ లాగటంలో కొంచెం వెనక్కు తూలాడు.

అలా జరుగుతుందని వూహించిన రాజు తమాయించు

కుని పొజిషన్‌లో నిలబడ గలిగాడు. లేకపోతే డాక్టర్, తనూ ఇద్దరూ క్రింద పడిపోయేవారు. చేతిలోని రివాల్వరు దూరంగా పడిపోయేది. అంతా తలక్రిందులై తాము చావటమో లేక ప్రాణాలతో పట్టుబడటమో జరిగేది.

మనిషెత్తు సేఫ్‌లో నోట్ల కట్టలుచూసి రాజు, కనకంల కళ్ళు ఆదోరకం వెలుగుతో మెరిసినయ్.

“ఏమిటిదంతా? ఆ డబ్బు ముట్టుకోవటానికి వీలేదు” అని అరుపు వినపడింది. కనకం అటువేపు చూశాడు, ఒకచేత్తో సుభద్రను గట్టిగా పొదవి పట్టుకుని.

సుబ్బారావుకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరుస్తూనే అతడి చూపులు తెరిచివున్న సేఫ్‌లోని నోట్ల దొంతరల మీద పడింది. తన భార్య మరొకడి చేతిలో బందీ అయి వుండటం, వాళ్ళ చేతుల్లోని రివాల్వర్నుచూసి పరిస్థితి వూహించాడు.

“మిస్టర్ లేచి నిల్చో. చేతులు మెడమీద అనించి గోడవైపు తిరుగు!” కనకం అరిచాడు.

“రాస్కెల్! నన్ను మోసం చేసింది ఇందుకా. చూసుకో నిన్నేం చేస్తానో!” అంటూ చేతికందు బాటులోవున్న ఫ్లవర్ వేజ్‌ని తీసి కనకం మీదకు విసిరాడు. కనకం కొంచెం ప్రక్కకు తిరిగాడు.

ఫ్లవర్ వేజ్ గాలిలోంచి వచ్చి సుభద్రకు తగిలింది. కణతకు దెబ్బతగిలింది. నెత్తురు కారింది. తుడుచుకునే ఆస్కారంకూడా లేకుండా ఆమె చేతుల్ని కనకం అదిమి పట్టుకున్నాడు. ఆమె తనకు తగిలిన దెబ్బ నుంచి తేరుకునేలోగా మరో ఘోరం జరిగింది.

కనకం చేతిలోని రివాల్వరు ప్రేలింది. సుబ్బారావు గుండెలో ఒకటి; పొట్టలో ఒక బుల్లెట్ దిగినయ్.

మెలికలు తిరుగుతూ నేలమీద పడిపోయాడు సుబ్బారావు.

"వద్దు! వద్దు! కావాలంటే నన్ను చంపండి! ఆయన్నేం చేయవద్దు!" అని అరిచింది సుభద్ర.

కాని అప్పటికే సుబ్బారావు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయినయ్.

డాక్టర్ విష్ణువరన్, సుభద్ర అరుపులకు చలించిపోయాడు. అతడి కళ్ళు చెమర్చినయ్. పెదవులు వణికినయ్. తను ఏం చేయటానికీ ఆస్కారం లేదు. సాహసించి ఏదైనా చేస్తే తన కళ్ళముందే సుభద్రను నానా భీభత్సం చేస్తారు. అది తను సహించలేడు.

రాణి సూట్‌కేసుల్ని తెచ్చి అక్కడ్నుంచి తిరిగి తను క్రిందకు వెళ్ళిపోయింది. రాసులుగా పడివున్న నోట్లకట్టలను చూసికూడ ఆమె చలించలేదు. త్వరగా ఈ వ్యవహారం పూర్తయి ఇక్కడ్నుంచి తాము తప్పించుకుని బయటపడితే చాలు అన్నట్టుగా ఆమె ఆతృత పడుతున్నది.

రాజు సూట్‌కేసుల్ని తెరిచి సేఫ్ దగ్గర వుంచాడు.

విష్ణువరన్ తన స్వంత చేతుల్తో నోట్లకట్టలను వాటిలో సర్దాడు. అతడికీ, వీళ్ళకు కావల్సినదేదో తీసుకుని వాళ్ళు ఎంత త్వరగా ఈ ఇంటిని వదిలిపోతే అంత మంచి దనిపించింది.

క్రింద నుంచి కారు హారన్ అదే పనిగా మ్రోగింది.

రాజూ, కనకం ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. కారుహారన్ మ్రోగిందంటే ఎవరో వచ్చారని సంకేతం.

కనకం కిటికీ దగ్గరకు వెళ్ళి తొంగిచూశాడు. మరో కారు వచ్చి ఆగింది. అందులోంచి ఇద్దరు స్త్రీలు, ఓ ముసలాయన దిగారు.

సూట్‌కేసులు నిండినయ్. వాటిని మూసేశారు.

సేఫ్‌లోదంతా ఎత్తుకుపోవాలంటే ఓ లారీ కావాలి. దొరికినదానితో తృప్తి పడకుండా అత్యాశకు పోతే అసలుకే ముప్పు కలగవచ్చు.

సేఫ్ మూసేసి, షట్టరు క్రిందకులాగి తాళం వేసేశాడు, విఘ్నవర్ధన్. వెనక్కువచ్చి సోఫాలో కూర్చున్నాడు. అతడి ప్రక్కగా రాజు మరో కుర్చీ లాక్కుని కూచున్నాడు. అతడి చేతిలోవున్న రివాల్వరుపై టవలు కప్పాడు.

"వాళ్ళు వస్తున్నట్టున్నారు, వెధవ వేషాలు వేసి ప్రాణాలు పోగొట్టుకోకండి!" అని హెచ్చరించాడు.

సుభద్రను అలానే పొదివి పట్టుకుని తలుపు వెనకగా దాక్కున్నాడు కనకం.

వచ్చిన అతిథులు లోపలకు రాంగానే ధడాలున తలుపు మూసేశాడు కనకం.

వాళ్ళలో ఒకామె నేలమీద శవాన్ని చూసి భయంతో కెవ్వుమని అరవబోయింది. కాని ముసలాయన ఆమె నోరు మూసేశాడు. "ఇక్కడ అంతా సవ్యంగా లేనట్టుందే!" అన్నాడు నింపాదిగా.

"అది మీ సత్ప్రవర్తనమీద ఆధారపడి వుంటుంది. అలా ఆ మూలకు వెళ్ళి గోడవైపుకు తిరిగి నిల్చోండి. మీ చేతులు మెడమీద వుంచండి. అయిదు నిముషాల్లో వెళ్ళిపోతాం! ఆ తర్వాత మీరు స్వేచ్ఛగా వెళ్ళిపోవచ్చు!" అన్నాడు కనకం రివాల్వర్‌ని వాళ్ళందరి వంకా ఆడిస్తూ.

"బాబూ! ప్రాణాలు తియ్యకు! చచ్చి నీ కడుపున పుడతాం!" అంది మరోకామె.

నేలమీదవున్న తాడుతో రాజు, డాక్టర్ విఘ్నవర్ధన్‌ని సోఫాకేసి కట్టేశాడు. కాళ్ళూ చేతులు గట్టిగా బంధించాడు. అతడికి హార్ట్ ఎటాక్ వచ్చి సోఫాలో అచేత

నంగా పడిపోయాడు.

తర్వాత సుభద్రను మరో కుర్చీలో కూర్చొబెట్టి తాళ్ళతో కట్టేశారు. వచ్చిన ముగ్గురు అతిథుల్ని గూడా తాళ్ళతో కట్టిపడేశారు. టేప్ తీసి వాళ్ళ అందరి నోళ్ళకు అతికించేశారు. సుభద్ర కన్నీరు మున్నీరుగా ఏడవసాగింది.

కిటికీలోంచి తల బయటికి పెట్టి రాణిని కేకేశాడు.

ఆమె పైకి వచ్చింది. సూట్ కేస్ తీసుకోమన్నట్టు సంజ్ఞ చేశాడు. ఆమె సూట్ కేస్ తీసుకుని క్రిందకు నడిచింది మెట్లుదిగి.

కనకం మరో సూట్ కేసు పుచ్చుకున్నాడు. రాజు క్రిందవున్న మూడో కేస్‌ని అందుకోవడానికి ముందుకు వంగాడు. అతని చేతిలోని రివాల్వరు ప్రేలింది.

బుల్లెట్స్ సూటిగా వెళ్ళి కనకానికి తగిలాయి. అతడి చేతిపట్టు విడిపోయింది. చేతిలోని సూట్ కేస్ క్రింద పడిపోయింది. ఆ తర్వాత అతడు నేలకూలాడు.

"రాజు సంపాదనలో వాటా ఎవరికీ దక్కకూడదు! గుడ్ బై పార్ట్‌నర్!" అంటూ రాజు రెండు చేతుల్లోనూ రెండు కేసుల్ను తీసుకుని క్రిందకు పరుగెత్తాడు.

అప్పటికే రాణి తను తీసుకొచ్చిన సూట్ కేసుని తమ కారులో వేసి స్టీరింగ్ ముందు కూర్చుంది రెడీగా.

అతిథులు తీసుకువచ్చిన కారుని చూడంగానే రాజుకి ఐడియా వచ్చింది.

అంతలోనే దూరంగా మైక్‌లో ఏదో ప్రకటన వినిపించింది.

14

కారు వెళ్ళిపోయిన చప్పుడు విని సుధీర్ లేచి నిల బడ్డాడు.

తనను కట్టివేయబడిన తాళ్ళ ఒరిపిడికి కాళ్ళూ చేతులూ ఒరవడి పడి ఆ చోట్లంతా మంటగా వుంది. నోరు తడారి పోయి వుంది.

గోడను ఊతంగా కాళ్ళు జాడించాడు ఒకసారి. ఒక రోజల్లా కట్టిపడివేయటం మూలాన కాళ్ళు సరిగా అనటంలేదు.

ఇంట్లోంచి ఎక్కడన్నా అలికిడి వస్తూందేమో అని చెవులు రిక్కించి విన్నాడు. ఆ ఇంట్లో ముగ్గురులోనూ ఒకడ్ని క్రూరంగా చంపేశారు. మిగతా ఇద్దరు రాక్షసుల్లో ఒకడు ఇంకా ఇంట్లోనే వుండవచ్చు అనే అనుమానంతో కొంచెంసేపు నిరీక్షించాడు. ఇంట్లో మనుషులున్న అలికిడి రాకపోవటంతో అతడు తలుపు తెరిచాడు.

బయట ప్రపంచం అంతా మామూలుగానే కనబడింది అతడికి. చెట్లమీద అరుస్తూ గోలచేస్తూన్న పక్షులను చూడంగానే అతడిలో నూతనోత్సాహం వచ్చింది. ఇప్పుడు తను గూడా స్వతంత్రుడే. ఆ రాక్షసులు వెళ్ళిపోయారు.

వాళ్ళు తన చేయి దాటిపోయారనేసరికి వుద్రేకం కలిగింది. ఆ రాక్షసుల్ని వదలగూడదని అనుకున్నాడు.

గబగబ అడుగులు వేస్తూ గోడ దగ్గరకు వెళ్ళాడు. నాలుగడుగుల పిట్టగోడ అది. ఒక్క వూపులో ఎగిరి కూర్చున్నాడు. మరో గెంతుతో తన ఇంటి ఆవరణలో వున్నాడు.

పెరటి తలుపు నెట్టుకుని లోపలకు వెళ్ళాడు. అతని తల్లి ముందు వసారాలో కూర్చుని ఏడుస్తూ వున్నది చెల్లాయిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని.

సుధీర్‌ని చూస్తూనే ఆమె ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"సుధీర్! నాయనా! ఎక్కడికి వెళ్ళావ్ మమ్మల్ని వదిలి!" అని అరిచింది.

రోడ్డుమీద గేటు దగ్గర నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్న తండ్రి లోపలకు పరుగెత్తుకొచ్చాడు.

"సుధీర్! ఎక్కడకు వెళ్ళావు!" అన్నాడు ఆత్రంగా. సుధీర్ ఒంటిమీద ఒరపిడి చారల్ని చూస్తూ "ఏమైంది?" అనడిగాడు.

"ప్రక్కింట్లోకి దిగాను నాన్నా! వాళ్ళు నన్ను బంధించి గదిలో దాచారు. ఆ ఇంట్లో ఇంకో శవంగూడా వుంది. వాళ్ళు ఇంకా ఇద్దరు మొగవాళ్లు, ఒక ఆడామె వుంది. అందులో ఒకడి ఫోటో పేపర్లోగూడా వేశారు పోలీసువాళ్ళు. వాడ్ని పట్టుకుంటే బహుమతి అని ప్రకటించారు. వాడు అవునో, కాదో నిర్ధారణ చేసుకుందామని వెళ్ళాను. వాళ్ళకు పట్టుబడిపోయాను. ఆడామె చాలా మంచిది నాన్నారూ! నన్ను చంపకుండా కాపాడింది! నాన్నా! మనం పోలీస్టేషన్‌కి వెళ్ళాలి!"

సుధీర్ ఏకబిగిన మాట్లాడేస్తుంటే గుడ్లప్పగించి విన్నారు నారాయణరావు, సరోజ.

మరో పావుగంటలో పోలీస్ వేన్ వచ్చి ఆ ఇంటి ముందు ఆగింది. పోలీసులు ఇల్లంతా శోధించి కుళ్లుకంపు కొడుతున్న శవాన్ని బయటకు లాగారు.

సుధీర్ చెప్పిన ఆనవాళ్ళను బట్టి మాజీ హంతకుడూ, నేరస్థుడూ అయిన రాజుని ఇట్టే పోల్చుకున్నారు. నల్లకారు అనిగూడా సుధీర్ చెప్పాడు.

వెంటనే అన్ని స్టేషన్లకూ మెసేజ్ చెప్పబడింది. మహాబలిపురం నుంచి బయటకు వెళ్ళే రోడ్లన్నిటిమీద గట్టి బందోబస్తు చేయబడింది. వచ్చేపోయే ప్రతికారునీ చెక్ చేసిగాని మరీ పోనివ్వటంలేదు.

అంతేకాకుండా, పోలీస్ వేన్ మైక్‌లోంచి ప్రకటన చేయబడింది పౌరుల రక్షణ గురించి.

ఇన్‌స్పెక్టర్ ఆర్ముగం షాక్ తిన్న వాడిలా లేచాడు. ఆ నేరసులు ఈ ఊరు ఏ పథకంతో వచ్చి వుంటారు? ఎంత ఆలోచించినా, వారి గమ్యం డాక్టర్ విష్ణువర్ధన్ కారాగారం దగ్గరికి పోతున్నది అతని ఆలోచన.

జీప్ వేసుకుని మరో నలుగురు పోలీసుల్ని వెంటబెట్టు కుని డాక్టర్ విష్ణువర్ధన్ ఇంటికి బయలుదేరాడు.

15

దూరంగా మైక్‌లో పోలీసులు చెబుతున్న ప్రకటన వినబడుతోంది.

"రాణి! త్వరగా! నీవు ఆ కారులో మద్రాసు వేపుగా పద! నేనూ ఈ రెండో కారులో వచ్చి నిన్ను కలుసు కుంటాను!" అని అరిచాడు.

రాణి కారు స్టార్టు చేసింది. కారు బయటకు దూకింది. మలుపులు తిరిగింది. వెనుక వేపునించి వస్తున్న జీప్‌లోని ఆర్ముగం సంతోషంతో అరిచాడు.

"అదుగో! అదే కారు! జీపు పోనీయ్ వేగంగా!"

రియర్ వ్యూలో వెనుకగా పోలీసు జీపు రావటం రాణి కంటబడింది. ఆమెలో ఉద్వేగం ఎక్కువయింది. కాలు ఏక్సిలేటర్‌ని బలంగా త్రొక్కింది.

కారుకీ జీప్‌కీ దూరం హెచ్చయింది. అదే పనిగా హారన్ మ్రోగిస్తూ కారుని పోనిస్తున్నది రాణి. దోవలో

మనుష్యులు బండ్లూ అడ్డం వస్తూన్నా ప్రక్కకు తప్పుకుని ముందుకు పోతున్నదే గాని బ్రేక్ మీద కాలు పెట్టలేదు.

రాణికారు అటు వెళ్ళగానే దానివెంట పోలీసు జీప్ వెంబడించటం చూశాడు రాజు. తన అదృష్టం బాగుండి వాళ్ళు తనని చూడలేదు.

మైక్ లో పోలీసు ప్రకటన వినపడుతోంది. "యువర్ ఎటెన్షన్ పోలీస్ పర్సనల్. నేరస్థులు కారులో మద్రాసు వెళ్ళే హైరోడ్డు మీదుగా పారిపోతున్నారు. పోలీసు కార్లూ జీప్ లూ అన్నీ అటుగా వెళ్ళాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి ఆజ్ఞ. కారు నల్లరంగుది. నెంబరు M Y P 2698. పాతమోడల్ ఫోర్డ్!"

రాజు నవ్వుకున్నాడు. తీరిగ్గా కారుని టూరిస్ట్ లాడ్జి ముందు ఆపాడు. రెండు సూట్ కేసుల్నీ మోసుకుని లోపలకు వెళ్ళాడు.

రూమ్ లో సూట్ కేసులు తెరిచాడు. ఆ డబ్బునంతటిని రెండు పెద్ద సైజు గుడ్డసంచుల్లో సర్దాడు. నెత్తిమీద హెల్మెట్ తీసేశాడు. బాత్ రూమ్ లో కళ్ళి శుభ్రంగా స్నానం చేశాడు.

ఈ ఊరినుంచి బయటపడాలంటే రోడ్డు రవాణా అంతా చెక్ చేయబడుతోంది, కనుక కారులోగాని, టాక్సీలోగాని, బస్సులోగూడ తను పోలేడు. ఇక పోతే సముద్రం మీదుగానే పారిపోవాలి!

గది తాళంవేసి టూరిస్ట్ క్లబ్ కేసి నడిచాడు. తీరంలో మోటార్ బోటు ఒకటి ఉంది. సముద్రంలోనుంచి వచ్చే నీళ్ళమీదుగా ప్లాట్ ఫారమ్ ఒకటి ఉంది. దాని ప్రక్కనే మోటార్ బోటు ప్లాట్ ఫారంమీద రొయ్యకు కట్టివేయబడి ఉంది.

దూరంగా మినుకు మినుకుమంటూ సముద్రంమీద లైట్లు కనబడుతున్నాయ్. అది ఏదో పట్టణం అయి ఉంటుంది. తెల్లారేలోగా తను ఆ తీరాన్ని చేరుకోగలిగితే, మర్నాడుదయంకల్లా తను కోటీశ్వరుడైపోతాడు.

ప్లాట్ ఫారమ్ చివరగా ఆయిల్ టిన్ను ఉంది. అదృష్టమంటే తనదే అనుకున్నాడు రాజు. కాకపోతే మోటార్ బోట్, ఆయిల్ టిన్ను అన్నీ అక్కడే సమకూరుతాయా?

హోటల్లో భోజనంచేసి సంచుల్ని భుజానికి తగిలించుకున్నాడు. రివాల్వరు జేబులో భద్రపరుచుకుని ఆటో రిక్షాలో క్లబ్ వేపుగా వెళ్ళాడు. బీచ్ లోంచి అడుగులు వేసుకుంటూ బోట్ క్లబ్ ప్లాటుఫారమ్ మీదకు వెళ్లాడు. సంచుల్ని బోటులో పడేశాడు.

ఊళ్ళో సంచలనంగా ఉండటంవల్ల జనం అందరూ ఎవరిళ్ళలో వాళ్ళు ఉండిపోయారు. మాటిమాటికీ వినపడే సైరన్లూ, ప్రకటనలూవిని హంతకులు తమ ఇంట్లోకి దూరతారేమో అని జాగ్రత్తపడుతున్నారు.

అందుకే బోట్ క్లబ్ గూడ నిర్మానుష్యంగా ఉంది. ఎవరూ లేరు.

రాజు ఆయిల్ టిన్నుని తీసుకుని బోట్ లో పెట్టాడు. ప్లాట్ ఫారమ్మీది తాడుని కత్తితో కోసేశాడు.

తెడ్డు తీసుకుని బోట్ ని సముద్రంలోకి పోనిచ్చాడు. గంటసేపు అలా గడిచిన తర్వాత లేచి డబ్బాలోని ఆయిల్ ని ఇంజనులో పోశాడు. ఆ తర్వాత ఇగ్నిషన్ కీ త్రిప్పాడు.

ఒకటి రెండుసార్లు ట్రబులిచ్చిన తర్వాత మూడోసారి బోట్ స్టార్టయింది.

అనంతమైన ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నయ్. అగాధమైన సముద్రంమీద బోటులో రాజు ముందుకు సాగిపోతున్నాడు. రేపుదయానికి తను ఏదో ఒకతీరాన్ని తాకితే ఆ తర్వాత తను ఎలా జీవించబోయేది ఊహించుకుంటూన్నాడు.

బోట్ ఇంజన్ చప్పుడు మినహా మరో శబ్దం వినరావటంలేదు. సముద్రం మీదుగా వచ్చేగాలికి అతడి జుట్టు రేగిపోతున్నది.

16

రాజు తన అవసరం పూర్తవగానే కనకాన్ని కాల్చి చంపటం ఆమెకు బాధ కలిగించింది. కాస్తో, కూస్తో వాడికీ పారేస్తే పోయేది. నిర్లిప్తంగా ఉన్న రాణికి పోలీస్ సైరన్ వినేసరికి ఆమెలో సంచలనం ప్రారంభమయింది.

కారు వేగం తగ్గకుండా జాగ్రత్త పడుతున్నది. జైలు కటకటాలు, పోలీస్ మాట్రన్ల అదిలింపులూ, జైల్లో ఖైదీల ఇబ్బందులు అన్నీ ఆమె కళ్ళముందు తిరిగినయ్.

ఎదురుగా పెద్ద ట్రక్కు వస్తోంది. మరోవైపు మలుపులోంచి చెవర్లెట్ కారు వస్తోంది. ట్రక్కుకి సైడ్ ఇచ్చి హారన్ మ్రోగిస్తోంది, అదే పనిగా.

చెవర్లెట్ కారు ఎడమ ప్రక్కనుంచి కుడివేపుకు రోడ్డు కడ్డంగా వచ్చింది. స్టీరింగ్ త్రిప్పింది గిర్రున. కారు బాగా ప్రక్కకు వెళ్ళింది. చెవర్లెట్ని తప్పుకుని మళ్ళీ రోడ్డెక్కింది.

కాని ఈలోగా చెవర్లెట్ కారు స్పీడు కొంచెం తగ్గించటంలో తనకారు దాని డిక్కీని రాచుకుంటూ రోడ్డెక్కింది. చెవర్లెట్ రోడ్డుదిగి ప్రక్కనే వున్న చిన్న గోతిలోకి దిగబడింది. డ్రైవర్ తిట్టుకుంటూ

దిగాడు.

రాణి నవ్వుతుంది తన సాహసానికి. ఏదో స్టంట్ పిక్చర్లో హీరోయిన్‌లా తను గొప్ప ఫీట్ చేసింది.

ఆమె కళ్ళముందు స్టుడియోలూ, కెమెరాలూ మెదిలినయ్. లైట్ల వెలుగులో తను హీరోయిన్ వేషంలో కెమెరా ముందు నిలబడింది. షూటింగ్ జరుగుతోంది. సస్పెన్స్‌తో నిండిన ఏడ్వెంచర్ సీన్‌లో తను పాల్గొంటున్నట్టుగా ఫీలయింది.

మరో జంక్షన్ వచ్చింది. ఈ నాల్గురోడ్ల కూడలిలో కొంచెం ట్రాఫిక్ కనబడింది. ఎద్దుల బండ్లూ, కార్లూ, పొరుగూరి సినిమా జనం కొంతమందీ నడుస్తున్నారు.

రాణి హారన్ మ్రోగిస్తూ జనం తక్కువగా ఉన్న మలుపులోకి త్రిప్పింది.

ఎదురుగా మరో అంబాసిడర్ కారు ఎదురువచ్చింది. అయినా ఆమె ఆగలేదు. ఎదురుగా అతివేగంగా డేర్ డెవిల్‌లా వస్తున్న కారును చూసి అంబాసిడర్ కారు ప్రమాదాన్ని ఊహించి సెకన్లలో ప్రక్కకు తప్పుకుంది.

రాణి నిట్టూర్పు విడిచింది. కారు ఇంకొంచెం ముందుకు పోయేసరికి ముందు మరో కారు అడ్డం వచ్చింది. ఆ కారూ తనుపోతున్న వేపే పోతున్నది. కాని తను దాని కన్నా వేగంగా పోవాలి.

ఆ కారు సైడ్ ఇవ్వడం లేదు. వ్యూఫైండర్‌లోకి చూసింది. పోలీస్ జీప్ దగ్గరౌతున్నది.

తన కారు స్పీడు ఎక్కించింది. ముందు పోతున్న కారుని ఒక ప్రక్కగా గుద్దేసింది. ముందు కారు అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రక్కకు జారిపోయింది.

విలన్‌లా పెద్దగా నవ్వుతూ తన కారుని ముందుకు

దూకించింది రాణి.

ఆ తర్వాత రోడ్డు క్లియర్ గా ఉంది. సంతోషంతో ఎగిరిపడింది రాణి. ఏక్సిలేటర్ ని త్రొక్కింది. కారు ఇంకా వేగాన్ని పుంజుకుంది. స్పీడో మీటరు ఎనభైమైళ్ళ వేగాన్ని చూపిస్తోంది.

వందగజాల దూరంలో రైలుపట్టాలు కనుపిస్తున్నాయ్. అక్కడ గేటులేదు. అది ఓపెన్ క్రాసింగ్. వార్నింగ్ బోర్డుమాత్రం రోడ్డుప్రక్కనే ఉంది.

రెండువైపులా చూసింది రాణి. ఒకవైపునుంచి ఎక్స్ప్రెస్ బండి వస్తున్నది.

రైలు రాకముందే తను రైలుపట్టాల్ని దాటిందంటే పోలీస్ జీప్ రైలు వెళ్ళేదాకా వెనుకే ఆగిపోవలసి ఉంటుంది. కనుక ఈ అవకాశాన్ని దాటి పోనివ్వగూడదనుకుంది రాణి.

రైల్లోంచి పెద్దగా కూత వినిపించింది వార్నింగ్ గా. అయినా ఆమె లక్ష్యపెట్టలేదు. లెవల్ క్రాసింగ్ మీదకు రాంగానే భయంతో స్టీరింగ్ త్రిప్పింది. ఆమె కళ్ళ ముందు ఏదో మెరుపు కనుపించింది. కారుని రైలు ఢీకొట్టింది.

రైలుపట్టాల మీదుగా కారుని నెట్టుకుంటూ రైలు ఫర్లాంగు దూరంవెళ్ళి ఆగింది. కారు నుగ్గునుగ్గు అయిపోయింది. స్టీరింగ్ రాడ్ ఊడివచ్చి రాణి గుండెల్లో పొడుచుకుంది. కళ్ళు తేలవేసి నోరు తెరచుకుంది.

ఆమె కళ్ళముందు నోట్లకట్టలు మెదిలినయ్. ఆ తర్వాత ఆమె ప్రాణాలు గాలిలో కలిసి పోయినయ్.

పోలీసులు కారుచుట్టూ మూగారు.

నడి సముద్రంలో బోటు ఆగిపోయింది. ఇంజన్ పని చేయటం ఆగిపోయింది. రాజు త త్తరపాటుతో ఇంజన్ని చెక్ చేశాడు. అందులో ఆయిల్ అయిపోయింది.

డబ్బాలొంచి ఇంకా ఆయిల్ పోశాడు. మళ్ళీ ఇంజన్ స్టార్ట్ చేశాడు. అది మొండికేసింది. గంటవరకూ అలానే పెనుగులాడాడు. కాని లాభంలేకపోయింది.

సిగరెట్ వెలిగించాడు. ఉస్సురంటూ నిస్సహాయంగా సీట్లో కూలబడ్డాడు.

ఒక గంటసేపు తెడ్డువేసి బోటుని నడిపాడు. అయినా గమ్యం కనిపించలేదు. జబ్బలు విపరీతంగా నొప్పిపెట్ట సాగాయి.

మరో గంట గడిచింది.

అతడికి దాహం వేసింది. నోట్లో లాలాజలాన్ని ఊరించు కోవడానికి ప్రయత్నం చేశాడు. క్రమేపీ నోరు ఎండిపో తున్నది.

దాహం పట్టలేక ముందుకు వంగి సముద్రంలోని నీళ్ళు చేతులోకి తీసుకుని నోట్లో పోసుకున్నాడు. కొంచెం దప్పిక తీరినట్టుగా ఉంది, నీళ్ళు ఉప్పగా అనిపించినా!

మళ్ళీ అయిదు నిముషాలు కాకుండానే అతడికి మళ్ళీ దాహం వేసింది. సముద్రపు ఉప్పునీరు త్రాగితే దాహం ఎక్కువౌతుందన్న విషయం అతడికి తెలీదు. ఉప్పు ప్రభావంవల్ల నోటిలో త్వరత్వరగా తడి ఆరిపోతుంది.

తన తొందరపాటులో తను నీరుగాని, ఆహారాన్ని గాని తెచ్చుకోలేదు. తెల్లారేసరికి ఏదో ఒకతీరాన్ని తాకకపోతానా అనుకున్నాడు. కాని ఈ బోటు తనను నడిసముద్రంలో ముంచుతుందని అనుకోలేదు.

సూర్యుడు సముద్రంలోంచి పైకి వచ్చాడు. అతడికి దాహం ఎక్కువౌతోంది. పిచ్చిగా తల వెంట్రుకలు పీక్కున్నాడు.

ఎండ వేడిమి నుంచి తలకాయగూడ దాచుకునే చోటు లేదు ఆ బోట్‌లో. సూర్యుడు పైకి వచ్చేకొద్దీ అతడు పెనంమీద బ్రెడ్‌లా మగ్గిపోసాగాడు.

సూట్‌కేస్ తెరిచి నోట్లకట్టలను ఆశగా తడిమాడు. ఆ తర్వాత వాటిని నాలుకతో నాకాడు. ఆ తర్వాత అచేతనంగా వాటిమీదనే పడిపోయాడు.

తెలివి తప్పిపోయేటప్పుడు అతనికి ఏదో శబ్దం వినిపించింది. తనబోటు ఇంజెన్ స్టార్ట్ అయినట్టు కలగన్నాడు. కళ్ళు తెరుద్దామని యత్నించినా తెరిపిడి పడలేదు. క్రమేపీ మత్తు ఆవరించింది అతన్ని.

మరో గంట గడిచేక హెలికాప్టర్ వచ్చింది అటుగా. అందులోనుంచి ఇన్‌స్పెక్టర్ ఆర్ముగం బైనాక్యులర్స్‌లో చూస్తున్నాడు.

“అదుగో మోటర్ బోట్” అంటూ అరిచాడు సంతోషంగా.

వైర్‌లెస్ రిసీవర్‌లో మెసేజ్ చెప్పసాగాడు.

మరో పావుగంటలో తీరం నుంచి మోటర్‌బోట్లు నీళ్ళమీదికి ఉరికినయ్.

18

డాక్టర్ విష్ణువర్ధన్ కళ్ళు తెరిచేసరికి ఎదురుగా సుభద్ర కనుపించింది. నౌకరు రాములు చేతులు కట్టుకొని నిలబడ్డాడు. మరో డాక్టర్, లాయర్ నారాయణరావూ, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల వంక చూశాడు. ఇన్స్‌పెక్టర్ ఆర్ముగం నిలబడి వున్నాడు. అతడి ప్రక్కనే సీళ్ళువేయబడిన రెండు సూట్‌కేసులవంక ఆశ్చర్యంగా

చూశాడు.

డాక్టర్ అతడిన్ని పరీక్షించాడు మళ్ళీ. "యస్! నౌ యూ కెన్ టాక్ టు హిమ్!" అన్నాడు నవ్వుతూ.

సర్కిల్ ఇన్స్పెక్టరు ముందుకు వచ్చాడు. "మీ అదృష్టాన్ని అభినందించలేకుండా వున్నాను డాక్టర్! మీ డబ్బు చాలా భాగం దొరికింది."

"థాంక్యూ సర్! మీ సేవ మరువలేనిది. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ కి నా విరాళం లక్ష రూపాయలు రాసుకోండి!" అన్నాడు విష్ణువరన్.

కాసేపు ముచ్చటించుకుని అందరూ వెళ్ళిపోయారు.

గేటులో ప్రెస్ రిపోర్టర్లు ఇన్స్పెక్టర్ ఆర్ముగం చుట్టూ మూగి ప్రశ్నలు వేస్తున్నారు.

"మామయ్యా! ఈ అనర్థానికంతా కారణం నేను! నావల్లనే ఇంటికి శని పట్టింది. నేనుగూడా ఈ ఇంటికి దూరంగా వెళ్ళిపోతాను!" అంది సుభద్ర.

"అలా అనకు సుభద్రా! నీకోసమే డబ్బుపోయినా నేను లక్ష్య పెట్టలేదు. ఈ ఇంటికి లక్ష్మివి నీవు. నీవు లేందే నేను బ్రతకలేను. నా జీవితపు చరమ ఘడియల్లో హాయిగా కన్నుమూయడానికే నిన్ను దేవుడు నా దగ్గరకు పంపాడు. ఇది నీ ఇల్లు! ఇంకా ఎక్కడకు పోతావ్!" అంటూ ఆమె చేతిని ఆప్యాయంగా నిమిరాడు విష్ణువరన్.

"మామయ్యా!" అంటూ అతడి గుండెలపై వ్రాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది సుభద్ర.

"అవసరంవున్న దానికన్న ఎక్కువ సంపద వుండటం కూడా అనర్థమే, డబ్బు పాపిష్టిది! నా వీలునామా ప్రకారం స్వచ్ఛంద సేవా సంస్థలకు, మెడికల్ రిసెర్చి

ఇన్స్టిట్యూట్‌కి విరాళాలు రేపే పంపేస్తాను. మిగతా డబ్బు బ్యాంకులో వేసి వచ్చే వడ్డీతో నిశ్చింతగా బ్రతుకుదాం!" అన్నాడు డాక్టర్ విష్ణువర్ధన్ స్ట్రాంగ్ రూమ్ వంక చూస్తూ.

*　　　*　　　*

ముగ్గురు మూర్ఖులు :—

నేరస్థుడ్ని నమ్ముకొని బంగారు జీవితాన్ని పోగొట్టుకున్న రాణి, మొదటి మూర్ఖురాలు!

తోటి నేరస్థుడ్ని నమ్మి, అతడికి సాయంచేసి ప్రాణాలు పోగొట్టుకున్న కనకం, మరో మూర్ఖుడు!!

తను కొల్లగొట్టుకొచ్చిన సంపదను చూసుకుని మురిసిపోయి గుడ్డిగా మృత్యుముఖంలోకి పారిపోయిన రాజు, చివరి మూర్ఖుడు!!!

—: ఐ పో యి ం ది :—